


'రాజముద్ర' తెలుగు దినపత్రికలో
ప్రకటనల కోసం సంప్రదించగలరు
సెల్ : 9182 474 575



www.rajamudranews.com

# అక్షర రాజముద్ర

ప్రతి అక్షరం - ప్రజల కోసం | తెలుగు దిన పత్రిక

AKSHARA RAJAMUDHRA | RNI No: TELTEL/2024/86684

| మేడ్చల్-మల్కాజ్‌గిరి | శుక్రవారం | 24.07.2026 | సంపుటి: 3 | సంచిక: 172 | పేజీలు : 8 | వెల : 2/- |
|---|---|---|---|---|---|---|
| MEDCHAL-MALKAJGIRI | FRIDAY | 24.07.2026 | V0LUME : 3 | ISSUE : 172 | PAGES: 8 | COST: 2/- |



**విలేకరులు కావలెను**

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.

సంప్రదించాల్సిన చిరునామా..

సెల్ : 9182 474 575


## పోటీ ప్రపంచంలో సింగరేణి నిలదొక్కుకోవాలి

- అందుకు సహకరించడమే ప్రభుత్వ లక్ష్యం
- సింగరేణితో భావోద్వేగ బంధం
- జెన్ కోకు నాణ్యమైన బొగ్గు సరఫరా చేయాలి
- బొగ్గు సింగరేణికి ప్రధాన ఆదాయ వనరు
- క్రిటికల్ మినరల్స్ అన్వేషణ, మైనింగ్ ప్రక్రియలోకి సింగరేణి ప్రవేశించాలి
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

3





## మహానగరం మధ్యన పేదోడికి ఇల్లు ఉండొద్దా?

- పదేళ్లు చేయలేనిది కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తుంటే విష ప్రచారమా?
- ఇండ్ల కేటాయింపులో బీసీలకు 50 శాతం రిజర్వేషన్
- రెవెన్యూ, హౌసింగ్ శాఖల మంత్రి పొంగులేటి

2

## ప్రతీ విద్యార్థి నుంచి అభిప్రాయ సేకరణ

- యూనిఫాంల నాణ్యతపై రాజీ పడేది లేదు
- పంపిణీలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు
- త్వరగా సరఫరా చేసేలా సంస్థలపై ఒత్తిడి పెంచాలి
- యూనిఫాం సరఫరాపై సమీక్షలో సీఎం రేవంత్ రెడ్డి

3



# ఢిల్లీలో నీట్ మంటలు







- ప్రతిపక్షాల నిరసనతో వేడెక్కిన జాతీయ రాజకీయాలు
- రాహుల్ గాంధీ నేతృత్వంలో ఇండియా కూటమి ఎంపీల ర్యాలీ యత్నం
- గాంధీ స్మృతికి వెళ్లకుండా బారికేడ్లతో అడ్డుకున్న పోలీసులు
- విద్యార్థులకు న్యాయం చేయాలని ప్రతిపక్షాల డిమాండ్
- నీట్ అంశంపై పార్లమెంట్‌లో చర్చ కోరిన విపక్షాలు
- కేంద్ర ప్రభుత్వ తీరుపై తీవ్ర విమర్శలు

**న్యూఢిల్లీ, జూలై 23**

"నీట్ వ్యవహారంలో నష్టపోయిన విద్యార్థులకు న్యాయం జరిగే వరకు మా పోరాటం ఆగదు. విద్యార్థులు ఒంటరివారు కాదు.. వారి కోసం మొత్తం ప్రతిపక్షం అండగా నిలుస్తుంది" అని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అన్నారు. నీట్ పరీక్షల వ్యవహారంపై విద్యార్థులకు సంఘీభావం ప్రకటించేందుకు ఇండియా కూటమి ఎంపీలతో కలిసి గాంధీ స్మృతికి శాంతియుత ర్యాలీగా వెళ్లేందుకు ప్రయత్నించిన సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. అయితే ర్యాలీని ఢిల్లీ పోలీసులు అడ్డుకోవడంతో రాజధానిలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

**ర్యాలీకి పోలీసుల అడ్డుకట్ట**

నిరసన కార్యక్రమానికి ముందు రాహుల్ గాంధీ నివాసంలో ఇండియా కూటమి ఎంపీలు సమావేశమయ్యారు. అనంతరం రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీ వాద్రా, ఇతర ప్రతిపక్ష నేతలు మూడు బస్సుల్లో గాంధీ స్మృతికి బయలుదేరారు. సమాచారం అందుకున్న ఢిల్లీ పోలీసులు రాహుల్ నివాసం వెలుపల భారీగా బారికేడ్లు ఏర్పాటు చేసి బస్సులను నిలిపివేశారు. పెద్ద సంఖ్యలో పోలీసు బలగాలను మోహరించడంతో అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

**విద్యార్థుల కోసం పోరాటం కొనసాగుతుంది**

నీట్ పరీక్షల వ్యవహారంతో మానసిక వేదనకు గురైన విద్యార్థులకు న్యాయం చేయడమే తమ లక్ష్యమని రాహుల్ గాంధీ తెలిపారు. ఆందోళనల్లో గాయపడిన విద్యార్థులకు సంఘీభావం తెలిపేందుకే గాంధీ స్మృతికి వెళ్తున్నామని చెప్పారు. విద్యార్థుల న్యాయమైన డిమాండ్ల కోసం దేశవ్యాప్తంగా ప్రతిపక్ష పార్టీలు ఐక్యంగా పోరాడతాయని

మిగతా 2వ పేజీలో..






## హైడ్రాకు హైకోర్టు మొట్టికాయలు!!

**హైదరాబాద్**

హైదరాబాద్ నగరాన్ని విపత్తుల నుండి రక్షించడానికి, ప్రభుత్వ ఆస్తులు, చెరువులను కాపాడటానికి తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన హైడ్రా ఇటీవల తీసుకుంటున్న కొన్ని శరవేగపు చర్యలు రాష్ట్రంలో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. ప్రజా ప్రయోజనాల పేరిట ప్రభుత్వ విభాగాలు తీసుకునే నిర్ణయాలు కొన్ని వివాదాస్పదమవుతున్నాయి.. అవి చట్ట పరిధులను, న్యాయవ్యవస్థ ఆదేశాలను

మిగతా 3వ పేజీలో..



2

## సాధ్యమైనంత త్వరగా ఉద్యమకారుల గుర్తింపు

## రేవంత్–కేటీఆర్ గ్లోబరీనా వార్..

- ముదిరిన మాటల యుద్ధం
- గ్లోబరీనా వ్యవహారంపై అధికార–ప్రతిపక్షాల మధ్య వాగ్వాదం
- పరస్పర ఆరోపణలు, సవాళ్లతో వేడెక్కిన రాజకీయాలు
- ఫిర్యాదు చేస్తే విచారణకు సిద్ధమన్న ముఖ్యమంత్రి
- పరువు నష్టం నోటీసు పంపినట్లు వెల్లడించిన కేటీఆర్
- లై డిటెక్టర్ పరీక్షకు రావాలంటూ సవాల్

2



### 'గ్లోబరీనాతో మాకు సంబంధం లేదు.. దమ్ముంటే విచారణ జరిపించాలి'

- గ్లోబరీనా ఆరోపణలపై ముఖ్యమంత్రికి పరువు నష్టం నోటీసు
- లై డిటెక్టర్ పరీక్షకు సిద్ధమంటూ రేవంత్‌కు సవాల్
- కాంగ్రెస్, బీజేపీపై ఘాటు విమర్శలు
- సింగరేణి, కాంట్రాక్టుల వ్యవహారాలపై ఆరోపణలు

2

### గ్లోబరీనా ముమ్మాటికీ కేటీఆర్ బినామీ సంస్థ

- గ్లోబరీనా తప్పిదాలకు కెటిఆర్ క్షమాపణలు చెప్పాలి
- ధర్మేంద్ర రాజీనామాను బీఆర్ఎస్ ఎందుకు డిమాండ్ చేయదు
- 'సర్' ప్రక్రియలో ఎస్సీ, ఎస్టీ ఓట్లు తొలగించే కుట్ర
- అందుకే అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిస్తున్నాం
- మీడియాతో చిట్‌చాట్‌లో సీఎం రేవంత్ రెడ్డి

2



## సెలవు పెట్టినందుకు ఉద్యోగం నుంచి తొలగింపు

- టెక్ మహీంద్రా సంస్థపై ఉద్యోగిని ఫిర్యాదు

**హైదరాబాద్, జూలై 23:**

ప్రముఖ ఐటీ సంస్థ టెక్ మహీంద్రాపై మహిళా సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని భావన దుండిగల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అనారోగ్యం కారణంగా తాను, అనంతరం తన చిన్నారి

మిగతా 2వ పేజీలో..

## గ్రేటర్ ఎన్నికలకు హైకోర్టు బ్రేక్

- జీహెచ్‌ఎంసీ ఎన్నికల నోటిఫికేషన్‌పై తాత్కాలిక స్టే.. వార్డుల పునర్విభజనపై కోర్టు ఆదేశాలు
- జీహెచ్‌ఎంసీ ఎన్నికల నోటిఫికేషన్‌పై హైకోర్టు తాత్కాలిక స్టే
- రాష్ట్ర ప్రభుత్వం, ఎన్నికల సంఘానికి కోర్టు కీలక ఆదేశాలు

3



# రేవంత్–కేటీఆర్ గ్లోబరీనా వార్..

**హైదరాబాద్, జూలై 23:**

గ్లోబరీనా సంస్థ వ్యవహారం తెలంగాణ రాజకీయాల్లో మరోసారి తీవ్ర చర్చకు దారితీసింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మధ్య ఈ అంశంపై మాటల యుద్ధం ముదిరింది. పరస్పరం ఒకరిపై ఒకరు ఆరోపణలు, సవాళ్లు విసురుకోవడంతో రాజకీయ వాతావరణం మరింత వేడెక్కింది.

**ఫిర్యాదు చేస్తే సమగ్ర విచారణ**

గ్లోబరీనా వ్యవహారంపై కేటీఆర్ అధికారికంగా సీసీఎస్‌లో ఫిర్యాదు చేస్తే పూర్తి స్థాయిలో విచారణ చేపడతామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ప్రభుత్వం నేరుగా చర్యలు తీసుకుంటే దానిని రాజకీయ కక్షసాధింపుగా ప్రచారం చేసే అవకాశం ఉంటుందని అన్నారు. జన్వాడ భూముల వ్యవహారం, గ్లోబరీనా అంశాల మధ్య సంబంధాలపై కూడా విచారణ జరిపిస్తామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్‌పై విమర్శలు చేస్తూ పలు వ్యాఖ్యలు చేశారు.

**కేటీఆర్ ఎదురుదాడి**

ముఖ్యమంత్రి వ్యాఖ్యలకు స్పందించిన కేటీఆర్, ఇప్పటికే పరువు నష్టం నోటీసు పంపినట్లు వెల్లడించారు. సమాధానం రాకపోతే కోర్టులోనే న్యాయపోరాటం చేస్తానని స్పష్టం చేశారు. గ్లోబరీనా సంస్థ తనదేనని ఆరోపిస్తే, అదే సంస్థతో ప్రస్తుత ప్రభుత్వం ఎందుకు ఒప్పందం చేసుకుందో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. వెంటనే విచారణ జరిపించాలని, అవసరమైతే తామిద్దరం లై డిటెక్టర్ పరీక్షకు కూడా సిద్ధమని సవాల్ విసిరారు. మరింత వేడెక్కిన రాజకీయ వాతావరణం గ్లోబరీనా వ్యవహారంతో పాటు ఫోన్ ట్యాపింగ్, ఫార్ములా ఈరేస్ వంటి అంశాలపై కూడా ఎలాంటి విచారణకైనా సిద్ధంగా ఉన్నానని కేటీఆర్ ప్రకటించారు. ఈ అంశాల్లో కేసులు నమోదు చేసినా ఎదుర్కొనేందుకు వెనుకాడబోనని పేర్కొన్నారు. గ్లోబరీనా వివాదం చుట్టూ అధికార, ప్రతిపక్షాల మధ్య ఆరోపణలు మరింత తీవ్రమవుతుండటంతో తెలంగాణ రాజకీయాల్లో ఈ అంశం రానున్న రోజుల్లో మరింత ప్రాధాన్యం సంతరించుకునే అవకాశం కనిపిస్తోంది.




# ఢిల్లీలో నీట్ మంటలు

**మొదటిపేజీ తరువాయి**

స్పష్టం చేశారు.

**పార్లమెంట్‌లో చర్చకు డిమాండ్**

నీట్ వ్యవహారంపై పార్లమెంట్‌లో సమగ్ర చర్చ జరపాలని, దీనికి రాజకీయ, పరిపాలనా బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని ప్రతిపక్ష పార్టీలు డిమాండ్ చేశాయి. దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడిన ఈ అంశంలో కేంద్ర ప్రభుత్వం సమర్థంగా స్పందించలేదని కాంగ్రెస్‌తో పాటు ఇండియా కూటమి భాగస్వామ్య పార్టీలు విమర్శించాయి. ఢిల్లీలో జరిగిన ఈ నిరసనతో నీట్ వివాదం మరోసారి జాతీయ రాజకీయాల్లో ప్రధాన చర్చగా మారింది.

# సాధ్యమైనంత త్వరగా ఉద్యమకారుల గుర్తింపు

- కమిటీ చైర్మన్ కేశవరావు వెల్లడి

**హైదరాబాద్, జూలై 23:**



తెలంగాణ ఉద్యమకారులను సాధ్యమైనంత త్వరగా గుర్తించి.. రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామని ఆ గుర్తింపు కమిటీ చైర్మన్ కె.కేశవరావు వెల్లడించారు. హైదరాబాద్‌లో గురువారం ఆయన మాట్లాడుతూ 16 రోజులు వివిధ సంఘాలతో చర్చించామని వివరించారు. ఉద్యమకారులను ఎలా ఎంపిక చేయాలి? ఎలా గౌరవించాలి అనే దానిపై అన్ని పార్టీల నుంచి అభిప్రాయాలు తీసుకున్నామన్నారు. ప్రభుత్వ నిర్ణయాన్ని అన్ని పార్టీలు స్వాగతించాయని తెలిపారు. సంఘాల నుంచి వచ్చిన సూచనలను ప్రభుత్వానికి నివేదిస్తామని స్పష్టం చేశారు. ఈ చర్చలకు 13 వేల మంది హాజరయ్యారని, దాదాపు వెయ్యి మంది సూచనలు చేశారని చెప్పారు. అయితే ఈ సమావేశాలు ముగియలేదన్నారు. వీటిపై ఆన్‌లైన్‌లో అభిప్రాయాలు కూడా తీసుకుంటామని తెలిపారు. అందుకు సంబంధించిన తేదీలు ప్రకటించి ఉద్యమకారులు, సంఘాల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తామని స్పష్టం చేశారు. ఉద్యమకారులకు తగిన గౌరవం దక్కేలా ఈ కమిటీ పనిచేస్తుందని కేశవరావు వివరించారు. త్వరలో వివిధ జిల్లాల్లో పర్యటించి.. ఉద్యమకారులు, సంఘాలతో సమావేశాలు నిర్వహిస్తామని ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ స్పష్టం చేశారు. అందుకు సంబంధించిన భవిష్యత్ కార్యాచరణను ప్రకటిస్తామని చెప్పారు. బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌ను గౌరవిస్తామని తెలిపారు. ఆయనను కూడా ఈ చర్చలకు ఆహ్వానిస్తామని చెప్పారు. అప్పటి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కూడా సమావేశం నిర్వహిస్తామని పేర్కొన్నారు. డిసెంబర్‌లోపే ప్రభుత్వానికి నివేదిక ఇవ్వడానికి ప్రయత్నం చేస్తామని కాంగ్రెస్ ఎమ్మెల్సీ దయాకర్ వివరించారు.

# సెలవు పెట్టినందుకు ఉద్యోగం నుంచి తొలగింపు

**మొదటిపేజీ తరువాయి**

ఆరోగ్యం బాగోలేక సెలవులు తీసుకున్న నేపథ్యంలో ఎలాంటి ముందస్తు నోటీసు ఇవ్వకుండా సంస్థ ఉద్యోగం నుంచి తొలగించిందని ఆమె ఆరోపించారు. భావన తెలిపిన వివరాల ప్రకారం, అనారోగ్యంతో 13 రోజుల పాటు సెలవులో ఉన్న సమయంలో, అలాగే తన కుమార్తె అనారోగ్యం కారణంగా మరికొన్ని రోజులు సెలవు తీసుకున్నప్పటికీ, యాజమాన్యం ఈమెయిల్‌ల ద్వారా వెంటనే విధులకు హాజరు కావాలని ఒత్తిడి తెచ్చిందని పేర్కొన్నారు. వ్యక్తిగత పరిస్థితులను పరిగణనలోకి తీసుకోకుండా వేధింపులకు గురిచేశారని ఆమె ఆరోపించారు. అంతేకాకుండా, కార్యాలయంలో వాష్‌రూమ్‌కు వెళ్లాలన్నా అనుమతి తీసుకోవాల్సిన పరిస్థితి ఉండేదని, ఉద్యోగులపై అత్యంత కఠినమైన నిబంధనలు అమలు చేస్తున్నారని ఆమె ఆరోపించారు. మహిళా ఉద్యోగులకు కుటుంబ బాధ్యతలు, చిన్నారుల సంరక్షణ వంటి అంశాలను దృష్టిలో ఉంచుకుని ఐటీ సంస్థలు మరింత మానవీయ దృక్పథంతో వ్యవహరించాలని విజ్ఞప్తి చేశారు. భావన ఫిర్యాదును స్వీకరించిన దుండిగల్ పోలీసులు ఘటనకు సంబంధించిన వివరాలను పరిశీలిస్తున్నారు. ఈ ఆరోపణలపై టెక్ మహీంద్రా యాజమాన్యం నుంచి అధికారిక స్పందన రావాల్సి ఉంది.

# గ్లోబరీనా ముమ్మాటికీ కేటీఆర్ బినామీ సంస్థ

- ఆ సంస్థ తప్పిదాల వల్ల 27 మంది బలి
- పేరు మార్చుకుని పరీక్షల కాంట్రాక్ట్ పొందింది
- గ్లోబరీనా తప్పిదాలకు కెటిఆర్ క్షమాపణలు చెప్పాలి
- ధర్మేంద్ర రాజీనామాను బీఆర్ఎస్ ఎందుకు డిమాండ్ చేయదు
- 'సర్' ప్రక్రియలో ఎస్సీ, ఎస్టీ ఓట్లు తొలగించే కుట్ర
- అందుకే అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిస్తున్నాం
- మీడియాతో చిట్‌చాట్‌లో సీఎం రేవంత్ రెడ్డి



**హైదరాబాద్, జూలై 23:**

గ్లోబరీనా ముమ్మాటికీ కేటీఆర్ బినామీ సంస్థ అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరోమారు ఆరోపించారు. గురువారం మీడియాతో చిట్ చాట్ మాట్లాడుతూ గ్లోబరీనా తప్పిదాల వల్ల 27 మంది చనిపోయారని, ఆ సంస్థ పేరు మార్చుకొని పరీక్షల కాంట్రాక్టు పొందిందని, వీటి ఆధారంగానే నీట్ కుంభకోణం జరిగిందని ఆరోపించారు. గ్లోబరీనా తప్పిదాలపై కేటీఆర్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అమరవీరుల స్తూపం వద్ద కేటీఆర్ ముక్కు నేలకు రాయాలన్నారు. కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ విషయంలో బీఆర్ఎస్ ఎందుకు మాట్లాడడం లేదని ప్రశ్నించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నేత కేటీఆర్, బీజేపీపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కేటీఆర్ బర్త్ డే పై సీఎం రేవంత్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 'కేటీఆర్ పుట్టిన రోజు దావత్ ఇస్తాడో లేదో అడగాలి. కేటీఆర్ ఇచ్చే దావత్ నేను తీసుకోలేనేమో. ఆయనవి అన్నీ వేరే పార్టీలు' అంటూ సెటైర్ వేశారు. హరీష్ గొప్పవాడైతే మంత్రి పదవి నుంచి ఎందుకు తీసేశారని ప్రశ్నించారు. అతి తెలివి తేటలతో ఏదిపడితే అది మాట్లాడతానంటే నడవదని హరీష్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ నేతలు కన్నెపెల్లి పంపు హౌజ్ గురించి మాట్లాడుతున్నారని, మేడిగడ్డ గురించి ఎందుకు మాట్లాడడం లేదని ప్రశ్నించారు. మేడిగడ్డ కట్టింది, కూల్చింది బీఆర్ఎస్ వాళ్లే అని వ్యాఖ్యానించారు. ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ అయిపోయే వరకూ ఎమ్మెల్యేలను గ్రామాల్లోనే ఉండమని చెప్పానని ముఖ్యమంత్రి అన్నారు. 'సర్' నాయకులకు సంబంధించింది కాదని, ప్రజలకు సంబంధించిందని స్పష్టం చేశారు. 'తెలిసీ తెలియక నాకు రెండు ఓట్లు ఉన్నాయని అంటున్నారు. కలెక్టర్ అనుమతి తీసుకొని నా గ్రామంలో ఉన్న ఓటును కొడంగల్‌కు మార్చుకున్నాను. గతంలో కొడంగల్ ప్రాంతం కర్ణాటకలోని జిల్లాలో ఉండేది. భాషా ప్రయుక్త రాష్ట్రాలు చేసినప్పుడు కొడంగల్ పాలమూరులోకి వచ్చిందని చెప్పారు. బీజేపీ కుట్రపూరితంగా ఓట్లను తొలగించే అవకాశముందని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. గ్రామీణ ప్రాంతంలో అమాయకుల ఓట్లు పోయే అవకాశముందన్నారు. 'సర్' ఉద్దేశం ప్రక్షాళన అని.. దానిని కుట్ర పూరితంగా వాడుతున్నారని ఆరోపించారు. ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ ఓట్లు పోతే కాంగ్రెస్ ఓట్లు పోయినట్టే అన్నారు. అవగాహన లేకపోవడం, సరైన సమయంలో స్పందించకపోవడం వల్ల ఓట్లు పోయే అవకాశముందన్నారు. ఓటు హక్కు లేకపోతే ఆధార్ పోతుంది.. ఓటు హక్కు లేకపోతే గుర్తింపే ఉండదు.. ఓటు హక్కు లేకపోతే సంక్షేమం రాదు' అని అన్నారు. బీజేపీలో అంతర్గత కలహాలు ఉన్నాయని రేవంత్ రెడ్డి అన్నారు. బీజేపీ నాయకులకు ఒకరంటే ఒకరికి పడదన్నారు. ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ ఓట్లు ఎక్కడుంటాయో బీజేపీకి తెలుసని వెల్లడించారు. ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లకు 5 లక్షలు ఇవ్వాలని డిసైడ్ అయిందని చెప్పారు. బీఆర్ఎస్ నేతలు.. బ్రోకర్లకు అమ్ముకొని దళారీ వ్యవస్థ తెచ్చారని మండిపడ్డారు. మేం ఏం చేస్తున్నామో అదే చెప్తున్నాం అని రేవంత్ స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు 70 శాతం ఎస్ఐఆర్ పూర్తయిందని తెలిపారు. ప్రక్షాళన పేరుతో వోట్లు తొలగించే అవకాశం ఉందని.. అలా జరగకుండా ఉండేందుకు బీఎల్‌వోలను పెట్టామన్నారు. వోట్లు లేకుంటే ప్రభుత్వ పథకాలు ఎలా వస్తాయని సీఎం ప్రశ్నించారు. గతంలో జీహెచ్ఎంసీ పరిధిలో ఉన్న ఆంధ్ర ఓట్లన్నీ తొలగించారు. కాంగ్రెస్ పార్టీ కోర్టుకు వెళితే జీహెచ్ఎంసీ కమిషనర్‌పై న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేసింది. పేదలకు ఇచ్చే ఇళ్లను బీఆర్ఎస్ నేతలు దళారులకు అమ్ముకున్నారు. జన్వాడ ఫాంహౌస్ భూములపై కేటీఆర్ విచారణ కోరాలి. మేం అధికారంలోకి వచ్చాకే ఇందిరాపార్కు వద్ద ధర్నా చౌక్‌ను తిరిగి ఓపెన్ చేశాం. నాడు వాళ్లు మూసిన ధర్నా చౌక్‌లోనే కేటీఆర్ ధర్నా చేస్తామంటున్నారని రేవంత్ వ్యాఖ్యానించారు.

**పేరు మార్చుకున్న గ్లోబరీనా..**

**ఆ సంస్థ నిర్మించిన ఫామ్‌హౌజ్‌లోనే కెటిఆర్**

సిఓఇఎంటి సంస్థ తెలంగాణలోనే పుట్టిందని, ఆ సంస్థతో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు సంబంధాలున్నాయని కాంగ్రెస్ ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ బల్మూరి వెంకట్ ఆరోపించారు. ఆ సంస్థ నిర్మించిన ఫామ్‌హౌస్‌లోనే కేటీఆర్ ఉంటున్నారని, సంస్థకు సంబంధించిన భూములు కూడా ఆయన వద్ద ఉన్నాయని పేర్కొన్నారు. 2019లో ఇంటర్ పరీక్షల నిర్వహణకు గ్లోబరీనా సంస్థకు అక్రమంగా టెండర్లు కేటాయించారని, ఆ సంస్థపై జేఎన్‌టీయూ హైదరాబాద్, జేఎన్‌టీయూ కాకినాడలో కేసులు నమోదైనా చర్యలు తీసుకోలేదన్నారు. 26 మంది విద్యార్థుల ఆత్మహత్యలకు కారణమైన వ్యవస్థపై అప్పటి ప్రభుత్వం స్పందించలేదని, దీనిపై కేటీఆర్ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల సమస్యలపై మాట్లాడే నైతిక హక్కు ఆయనకు లేదని, వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఢిల్లీలో ధర్నా చేస్తున్న విద్యార్థులపై జరిగిన దాడిని బీఆర్ఎస్ ఖండించలేదని, బీజేపీని ప్రశ్నించే ధైర్యం కూడా ఆ పార్టీకి లేదని అన్నారు. అలాంటి పరిస్థితుల్లో కేటీఆర్ మహాధర్నా చేపట్టడం సిగ్గుచేటని విమర్శించారు. శాంతియుతంగా నిరసనలు చేపడితే ప్రభుత్వం ఎలాంటి అడ్డంకులు సృష్టించదని, కానీ శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే మాత్రం చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. కొత్త పేరుతో మరో సంస్థను ఏర్పాటు చేసి సీబీఎస్ఈతో కూడా వ్యవహరిస్తోందని వెంకట్ ఆరోపించారు. ఇప్పుడు విద్యార్థుల కోసం పోరాడుతున్నట్లు కేటీఆర్ మాట్లాడడం హాస్యాస్పదమన్నారు. నీట్ పేపర్ లీక్ వ్యవహారంలో కూడా కేటీఆర్ ప్రమేయంపై అనుమానాలు ఉన్నాయని ఆరోపించారు. బీఆర్ఎస్ పాలనలో పేపర్ లీకేజీలు ఎక్కువగా జరిగాయని విమర్శించారు. ఇదిలా ఉంటే.. కేటీఆర్ తన పుట్టిన రోజు కోసం పది రోజుల ముందే దుబాయ్ వెళ్లారని, అక్కడ సినీ పరిశ్రమకు చెందిన కొందరితో కలిసి పార్టీ జరుపుకున్నారన్నారు. దుబాయ్ నుంచి తిరిగి వచ్చిన తర్వాత మూడు రోజుల పాటు పూర్తిగా రెస్ట్ మోడ్‌లో ఉన్నారని, ఆ తర్వాత ఒక్కసారిగా విద్యార్థుల ధర్నా పేరుతో డ్రామా ప్రారంభించారని బల్మూరి విమర్శించారు.

# 'గ్లోబరీనాతో మాకు సంబంధం లేదు.. దమ్ముంటే విచారణ జరిపించాలి' : కేటీఆర్

- గ్లోబరీనా ఆరోపణలపై ముఖ్యమంత్రికి పరువు నష్టం నోటీసు
- లై డిటెక్టర్ పరీక్షకు సిద్ధమంటూ రేవంత్‌కు సవాల్
- కాంగ్రెస్, బీజేపీపై ఘాటు విమర్శలు
- సింగరేణి, కాంట్రాక్టుల వ్యవహారాలపై ఆరోపణలు
- జిల్లాల నుంచి రాజకీయ కార్యాచరణ ప్రారంభిస్తామని ప్రకటన

**వరంగల్, జూలై 23**



"గ్లోబరీనా సంస్థతో మాకు ఎలాంటి సంబంధం లేదు. దమ్ముంటే వెంటనే విచారణ జరిపించాలి. అవసరమైతే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో కలిసి లై డిటెక్టర్ పరీక్షకు కూడా సిద్ధమే" అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. వరంగల్‌లో నిర్వహించిన చిట్‌చాట్ కార్యక్రమంలో మాట్లాడిన ఆయన, గ్లోబరీనా వ్యవహారంపై తనపై చేసిన ఆరోపణలకు సంబంధించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఇప్పటికే పరువు నష్టం నోటీసు పంపినట్లు వెల్లడించారు. నోటీసుకు తగిన సమాధానం ఇవ్వకపోతే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని స్పష్టం చేశారు.

**విచారణకు సిద్ధమని స్పష్టీకరణ**

గ్లోబరీనా సంస్థ తనదేనని ఆరోపిస్తే, అదే సంస్థతో ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు ఒప్పందం చేసుకుందో ప్రజలకు చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపించాలని కోరుతూ, దర్యాప్తుకు పూర్తిగా సహకరిస్తానని తెలిపారు. గ్లోబరీనా, ఫోన్ ట్యాపింగ్, ఫార్ములా ఈరేస్ వంటి ఏ అంశంపైనా విచారణకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు.

**రేవంత్, బీజేపీపై విమర్శలు**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బీజేపీపై విమర్శలు చేయడానికి వెనుకాడుతున్నారని కేటీఆర్ ఆరోపించారు. పాత కేసుల భయంతోనే బీజేపీ నాయకత్వంపై స్పందించడం లేదని అన్నారు. సింగరేణిలో జరుగుతున్న అక్రమాలపై కూడా బీజేపీ మౌనం పాటిస్తోందని విమర్శించారు. తెలంగాణ ప్రయోజనాల విషయంలో బీఆర్ఎస్ రాజీపడదని స్పష్టం చేశారు.

**రాజకీయ కార్యాచరణపై సంకేతాలు**

రేవంత్ రెడ్డి కుటుంబానికి సంబంధించిన కాంట్రాక్టులపై కూడా కేటీఆర్ ఆరోపణలు చేశారు. గ్లోబరీనా సంస్థ తనదేనని నిరూపిస్తే రాహుల్ గాంధీతో కలిసి తన నివాసం ముందు ధర్నా చేయాలని సవాల్ విసిరారు. త్వరలో జిల్లాల నుంచే పార్టీ రాజకీయ కార్యక్రమాలను ప్రారంభించి, అన్ని వర్గాల ప్రజలను కలుపుకుని ముందుకు సాగుతామని వెల్లడించారు.

# మహానగరం మధ్యన పేదోడికి ఇల్లు ఉండొద్దా?



**హైదరాబాద్, జూలై 23 :**

హైదరాబాద్ మహానగరం నడిబొడ్డున పేదలకు గౌరవప్రదమైన సొంతింటిని అందించాలనే ప్రజా ప్రభుత్వ సంకల్పాన్ని చూసి బీఆర్ఎస్ నాయకత్వం తీవ్ర అసహనానికి గురవుతోందని రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార, పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి విమర్శించారు. నిరుపేదలు నివసిస్తున్న ప్రాంతంలోనే వారి సొంతింటి కలను నెరవేర్చడానికి నియోజకవర్గాన్ని యూనిట్‌గా తీసుకొని ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తున్నామన్నారు. వీటి కోసం స్థానికంగా ఉన్న మీ సేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని, మీసేవ వాట్సాప్ నెంబరు 8096958096, వెబ్‌సైట్ (ఎవవ.సవజa.tవశ్రీaఅస్త్రaఅa.స్త్రశీజ.అఅ) ద్వారా కూడా దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. సచివాలయంలోని తన కార్యాలయంలో ఇందిరమ్మ ఇండ్లు, దరఖాస్తులు తదితర అంశాలపై అధికారులతో గురువారం సమీక్షించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ పదేళ్ల పాలనలో వారు చేయలేని పనిని కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తుంటే ప్రజలను తప్పుదోవ పట్టించేలా విష ప్రచారాలతో రాజకీయ లబ్ధిపొందాలని బీఆర్ఎస్ యత్నిస్తోందని ఆరోపించారు. నగరంలోనే పుట్టి పెరిగి అక్కడే జీవిస్తున్న నిరుపేద కుటుంబాలకు నగర నడిబొడ్డులో సొంతింటిని సమకూర్చాల్సిన బాధ్యతను గత ప్రభుత్వం విస్మరించి వారిని నగరానికి దూరంగా నెట్టివేసిందన్నారు. ఉద్యోగాలు, ఉపాధి, పిల్లల చదువులు, వైద్య సౌకర్యాలకు 3040 కి.మీ దూరంలో కనీస వసతులు కల్పించకుండా అరకొరగా ఇళ్లను నిర్మించి అదే పేదల సంక్షేమమని చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. ప్రజా ప్రభుత్వం పేదోడు కూడా హైదరాబాద్ నడిబొడ్డులో గౌరవంగా జీవించాలనే భావనతో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణాలను చేపట్టిందని తెలిపారు. ప్రభుత్వ భూములను ప్రజల సంక్షేమం కోసం వినియోగిస్తూ పేదలకు శాశ్వత భరోసా కల్పించే చరిత్రాత్మక నిర్ణయం తీసుకుంటే దానిపైనా విషప్రచారం చేస్తోందని మండిపడ్డారు. నగరంలో అత్యంత విలువైన ప్రభుత్వ భూములలో పేదలకు ఇళ్లు నిర్మించకూడదా.. ప్రభుత్వ భూములు కొద్దిమంది కోసం మాత్రమేనా.. పేదల కోసం వినియోగిస్తే ఎందుకింత కడుపుమంట అని ప్రశ్నించారు. పేదోడిపై తుపాకి పెట్టి రాజకీయాలు చేయాలనుకోవడం అత్యంత దుర్మార్గమన్నారు. బీఆరఎస్ విష ప్రచారాలను, కపట నాటకాలను మహానగర ప్రజలు గమనించాలని, పేదల సంక్షేమాన్ని అడ్డుకునే రాజకీయాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు.

**ఇందిరమ్మ టవర్స్‌పై బీఆర్ఎస్ దుష్ప్రచారం**

గతంలోని డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను ఇందిరమ్మ టవర్స్‌గా మార్చి విక్రయిస్తారన్న ప్రచారం అవాస్తవమన్నారు. ప్రభుత్వం ప్రకటించిన మార్గదర్శకాల ప్రకారమే ఇందిరమ్మ టవర్స్ నిర్మిస్తామని, లబ్ధిదారుల మీద ఆర్థిక భారం తగ్గించేందుకు ప్రభుత్వం రూ.5 లక్షల సబ్సిడీ ఇస్తోందని తెలిపారు. ఇది అమ్మకం కాదు.. ప్రభుత్వ ఆర్థిక సహకారం. లబ్ధిదారుడి వాటా అన్ని ప్రాంతాల్లో రూ.6 లక్షలు మాత్రమే. ఫ్లాట్ల మార్కెట్ విలువ తొలి విడతలో ప్రారంభించనున్న 16 నియోజకవర్గాల్లో రూ.40 లక్షల నుంచి రూ.60 లక్షల వరకు ఉందన్నారు. ఎసఆర్‌వో(బేసిక్) విలువ రూ.14.6 లక్షల నుంచి రూ.28.4 లక్షల వరకు ఉందని చెప్పారు. దీంతో ప్రభుత్వం అందించే సబ్సిడీ, భూమి విలువ, నిర్మాణ వ్యయాన్ని కలిపి పేదలకు అత్యంత తక్కువ ధరలో గృహాలను అందించే అవకాశం కల్పిస్తోందన్నారు. క్యూర్ పరిధిలో తొలి విడతగా ప్రయోగాత్మకంగా నిర్మించే ఇళ్లలో యాజమాన్య హక్కులకు సంబంధించి ఎస్సీలకు 14, ఎస్టీలకు 5, బీసీలకు 16, దివ్యాంగులకు 5, ప్రభుత్వ అవుట్ సోర్సింగ్, 4వ తరగతి ఉద్యోగులు, పారిశుధ్య కార్మికులకు 10 శాతం చొప్పున రిజర్వేషన్ కల్పిస్తున్నామని వివరించారు. ఇందులోనూ 30 శాతం మహిళలకే కేటాయిస్తున్నామని, మిగతా 50 శాతం జనరల్ కేటగిరీలో కేటాయిస్తామని తెలిపారు. పేద, మధ్యతరగతి ప్రజలపై బీఆరఎస్‌కు, ఆ పార్టీలోని దొరలకు ఏ మాత్రం అభిమానం, ప్రేమ ఉన్నా విష ప్రచారాన్ని మానుకుంటారని ఆశిస్తున్నానన్నారు. ఈ విష ప్రచారాన్ని కొనసాగిస్తే జూబ్లీహిల్స్, కంటోన్మెంట్ ఉప ఎన్నికల్లో పట్టిన గతే రాష్ట్రవ్యాప్తంగా పడుతుందని మంత్రి పొంగులేటి హెచ్చరించారు.

# పోటీ ప్రపంచంలో సింగరేణి నిలదొక్కుకోవాలి



**సత్తుపల్లి, జూలై 23:**

పోటీ ప్రపంచంలో సింగరేణి క్యాలరీస్ సంస్థను సమర్థవంతంగా నిర్వహిస్తూ, వ్యాపార విస్తరణ ద్వారా భవిష్యత్ తరాలకు సురక్షితంగా అందించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. సింగరేణి తెలంగాణకు ఆత్మలాంటిది.. కార్మికులు, ప్రజలతో 130 ఏళ్ల చరిత్రకలిగిన సింగరేణితో భావోద్వేగ అనుబంధం ఉందని ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క అన్నారు. ఈ ప్రభుత్వ రంగ సంస్థను కాపాడుకోవడమే కాకుండా, రాబోయే తరాలకు లాభదాయకంగా అందించడం మన అందరి బాధ్యత అని ఆయన అన్నారు. సత్తుపల్లిలోని సింగరేణి ఒపెన్ కాస్ట్ బొగ్గుగనిని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పరిశీలించారు. గనిలో బొగ్గు లభ్యత, పరిమాణం, బొగ్గు క్వాలటీని పరిశీలించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో పాటుగాఎనర్జీ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ నవీన్ మిట్టల్, సింగరేణి సీఎండీ జ్యోతి బుద్ధ ప్రకాష్, జెన్ కో సీఎండీ హరీష్, సింగరేణి డైరెక్టర్ గౌతమ్ పోట్రూ, ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, ఎమ్మెల్యేలు మట్టా రాగమయి, మాలోత్ రాందాస్ నాయక్ తదితరులు పాల్గొన్నారు. ప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మీడియాతో మాట్లాడుతూ.. మైనింగ్ నిర్వహణలో పాటిస్తున్న పద్ధతులు, ఎదురవుతున్న సవాళ్లు, భవిష్యత్తు ప్రణాళికలను ప్రత్యక్షంగా చూడటానికే క్షేత్రస్థాయి పరిశీలనకు వచ్చినట్లు చెప్పారు. ఓవర్ బర్డెన్ అనేది మైనింగ్ లో బయటకు తీసే మట్టి, రాతి వ్యర్థం. బొగ్గు అనేది సింగరేణికి ప్రధాన రాబడి తెచ్చే అత్యంత విలువైన వనరుగా ఆయన చెప్పారు. కాంట్రాక్టర్లకు మట్టి తీసినా వాల్యూమ్ ప్రకారమే బిల్లులు వస్తాయి కాబట్టి వారి దృష్టిలో రెండూ ఒక్కటే అనిపించవచ్చు. సింగరేణి యాజమాన్యానికి మాత్రం ఓవర్ బర్డెన్, బొగ్గు మధ్య ఉన్న వ్యత్యాసం చాలా స్పష్టంగా తెలిసి ఉండాలన్నారు. ఫేస్ వద్ద బ్లాస్టింగ్ జరిపి, లోడింగ్ చేసే సమయంలో బొగ్గులో ఓవర్ బర్డెన్ మట్టి, రాళ్ళు కలవకుండా చూడాలన్నారు. ప్రతీ షావల్ దగ్గర, ప్రతీ లోడింగ్ పాయింట్ దగ్గర మన అధికారులు ఉండి కంటిన్యూయస్ మానిటరింగ్ చేయాలన్నారు. నాణ్యత లేని బొగ్గును రవాణా చేయడం వల్ల అనవసరమైన ట్రాన్స్‌పోర్ట్ ఖర్చులు పెరగడమే కాకుండా, థర్మల్ పవర్ ప్లాంట్లలో ప్రొడక్షన్ తగ్గిపోయి ట్రిప్ అవుతాయని అన్నారు. కల్తీ లేని నాణ్యమైన బొగ్గును మాత్రమే జెన్ కోకు ఇతర కస్టమర్లకు సరఫరా చేయాలని అధికారులకు సూచనలు చేశారు. ఒకప్పుడు బొగ్గు రంగంలో ఏకఛత్రాధిపత్యం ఉండేది. ఈ రోజు పరిస్థితి మారిందని అన్నారు. మార్కెట్‌లో ప్రైవేటు సంస్థలు పోటీకి వస్తున్నాయి. విదేశాల నుంచి 'ఇంపోర్టెడ్ కోల' వస్తోందన్నారు. ఈ కాంపిటీటివ్ మార్కెట్ లో సింగరేణి నిలబడాలంటే అత్యంత నాణ్యమైన బొగ్గును ఉత్పత్తి చేయలని అన్నారు. అంతేకాక బొగ్గు ఉత్పత్తి వ్యయం తగ్గించడం ముఖ్యమని అన్నారు. గత పదేళ్ల కాలంలో కొత్త కోల్ బ్లాక్స్ వేలంలో సింగరేణి పాల్గొనకపోవడం వల్ల చాలా అవకాశాలను కోల్పోయామని చెపోయారు. ఒక కోల్ బ్లాక్ వేలంలో దక్కించుకుని, అక్కడ భూసేకరణ, అటవీ అనుమతులు సాధించి మైనింగ్ ప్రారంభించడానికి కనీసం 7 నుంచి 8 ఏళ్ల సమయం పడుతుందన్నారు. ఈ నేపథ్యంలో సింగరేణి కనీసం 10 ఏళ్ల ముందస్తు ప్రణాళికతో పని చేయాలని అన్నారు. రాబోయే పదేళ్లలో రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ ఎంత పెరుగుతుంది? దానికి ఎంత బొగ్గు అవసరం? అనే దానిపై సింగరేణి యాజమాన్యం - జెన్ కో యాజమాన్యం కలిసి కూర్చుని ఉమ్మడి కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసుకోవాలన్నారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తాడిచర్ల2, నైని వంటి బ్లాక్‌లకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న భూసేకరణ, ఫారెస్ట్ అనుమతుల సమస్యలను వేగంగా పరిష్కరించామని అన్నారు. రాబోయే రోజుల్లో దేశవ్యాప్తంగా జరిగే నూతన కోల్ బ్లాక్స్ వేలంలో సింగరేణి పాల్గొనేలా ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందన్నారు. ప్రపంచం మొత్తం ఈ రోజు గ్రీన్ ఎనర్జీ వైపు వెళ్తోంది. సింగరేణి కూడా కేవలం బొగ్గు ఉత్పత్తికే పరిమితం కాకుండా సోలార్ ఎనర్జీ రంగంలోకి వేగంగా అడుగులు వేయాలన్నారు. భవిష్యత్తులో థర్మల్ పవర్‌కు ప్రత్యామ్నాయంగా సోలార్, పంప్డ్ స్టోరేజ్, హైడ్రోజన్, న్యూక్లియర్ ఎనర్జీ వాడకం పెరుగుతుందని అన్నారు. దీనికి అనుగుణంగా సింగరేణి సోలార్ పవర్ ఉత్పత్తిపై మరింత దృష్టి పెట్టాలని స్పష్టం చేశారు. మైనింగ్ రంగంలో సింగరేణి సంస్థకున్న అపారమైన అనుభవం, నిపుణులైన సాంకేతిక శక్తి కేవలం బొగ్గుకే పరిమితం కాకూడదన్నారు. సెమీకండక్టర్లు, చిప్ తయారీకి అవసరమైన క్రిటికల్ మినరల్స్, రేర్ ఎర్త్ మినరల్స్ అన్వేషణ, మైనింగ్ ప్రక్రియలోకి సింగరేణి ప్రవేశించాలని పిలుపునిచ్చారు. సింగరేణిని కాపాడుకుంటూ, లాభాల బాట పట్టిస్తూ, ప్రపంచస్థాయిలో నిలబెట్టేందుకు తెలంగాణ ప్రభుత్వం ఎలాంటి సహాయ సహకారాలైనా అందించడానికి సిద్ధంగా ఉందని డిప్యూటి సీఎం అన్నారు. అధికారులు, ఇంజనీర్లు, కార్మికులు సమన్వయంతో పనిచేసి సింగరేణి ప్రభను మరింతగా వెలిగించాలని భట్టి విక్రమార్క చెప్పారు.



# అర్చకులు, గిరిజన అర్చకుల పాత్ర అభినందనీయం

- **వారి సంక్షేమానికి సంప్రదింపుల కమిటీ పూర్తి భరోసా**

**హైదరాబాద్, జూలై 22 :**

స్వరాష్ట్ర సాధన ఉద్యమంలో ఆలయాల వేదికగా మంత్రోచ్ఛారణలు, ఆధ్యాత్మిక చైతన్యం ద్వారా సకల జనులలో స్వరాష్ట్ర కాంక్షను రగిలించడంలో అర్చకులు, గిరిజన అర్చకులు నిర్వహించిన పాత్ర అభినందనీయమని ఉద్యమకారుల గుర్తింపు కమిటీ కొనియాడింది. రాష్ట్రవ్యాప్తంగా మలి దశ ఉద్యమంలో ఆధ్యాత్మిక రంగాన్ని ఏకం చేసి పోరాడిన అర్చకులు, గిరిజన అర్చకుల ప్రతినిధులతో కమిటీ బుధవారం ప్రత్యేక ముఖాముఖి సమావేశాన్ని నిర్వహించింది. సమావేశంలో కమిటీ సభ్యులు ప్రొఫెసర్ ఎం.కోదండరామ్, మోతె శోభన్ రెడ్డి, ఎస్.రాములు నాయక్ పాల్గొని అర్చక స్వాములు సమర్పించిన వినతి పత్రాలను స్వీకరించారు.

**అర్చకులు, గిరిజన అర్చకుల ప్రధాన డిమాండ్లు**

అర్చక సమాఖ్య నాయకులు తమ సంక్షేమానికి సంబంధించి పలు ప్రధాన అంశాలను కమిటీ దృష్టికి తీసుకొచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా ఆలయాల నిర్వహణను మరింత బలోపేతం చేసేందుకు ధూపదీప నైవేద్యం కింద ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయాన్ని తక్షణమే పెంచాలని విజ్ఞప్తి చేశారు. అర్చకుల, గిరిజన అర్చకుల పిల్లలకు వేద విద్యతో పాటు నాణ్యమైన సాధారణ విద్యను పూర్తిగా ఉచితంగా అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. నిరుపేద గిరిజన అర్చకులకు, అర్చక కుటుంబాలకు సొంతింటి కల నెరవేర్చేలా 250 గజాల నివాస భూమిని కేటాయించి ఉచిత రిజిస్ట్రేషన్ చేయాలన్నారు. అర్చక కుటుంబాల అత్యవసర వైద్య అవసరాల నిమిత్తం అపరిమిత ఉచిత వైద్యం అందేలా ప్రత్యేక డిజిటల్ హెల్త్ కార్డులను జారీ చేయాలని కూడా కోరారు.

# కాళేశ్వరం అవినీతికి అండగా రేవంత్ చర్యలు

- **కెసిఆర్‌ను కాపాడుతున్నది సిఎం రేవంతే**
- **30 నెలలుగా చర్యలు తీసుకోక పోవడంపై అనుమానాలు**
- **నిజామాబాద్ ఎంపీ ధర్మపురి విమర్శలు**

**న్యూఢిల్లీ, జూలై 23:**



కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతిపై ఈ 30 నెలలుగా సీఎం రేవంత్ రెడ్డి ఏం చేశారని నిజామాబాద్ బిజెపి ఎంపీ ధర్మపురి అర్వింద్ సందేహం వ్యక్తం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు మొత్తం సీబీఐ విచారణకు ఎందుకు ఇవ్వలేదని తెలంగాణ సీఎంను ఈ సందర్భంగా ఆయన సూటిగా ప్రశ్నించారు. గురువారం న్యూఢిల్లీలో బీజేపీ ఎంపీ మాట్లాడుతూ.. రూ.30 వేల కోట్ల విలువైన పనులు జరిగిన తర్వాత ఎన్డీఎస్ఏ దగ్గరకు వచ్చారని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌తో రూ. లక్ష కోట్లు నీళ్లలో పోయాయని కేంద్ర జలశక్తి మంత్రి పార్లమెంట్‌లో చెప్పారని గుర్తు చేశారు. రూ. లక్ష కోట్లు ముంచిన కేసీఆర్‌ను రేవంత్ రెడ్డి కాపాడుతున్నాడని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో కేసీఆర్, కేటీఆర్ దోచుకున్న పైసలను ప్రస్తుతం వారి నుంచి సీఎం రేవంత్ దోచుకుంటున్నారా? అని అనుమానం వ్యక్తం చేశారు. కేసీఆర్ కుటుంబం వద్ద సీఎం రేవంత్ రెడ్డి ఎంత తీసుకున్నాడు.. ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీకి ఎంత ఇచ్చాడని ఎంపీ ధర్మపురి అర్వింద్ ప్రశ్నించారు. తెలంగాణలో సాగు, తాగు, థర్మల్ పవర్ ప్లాంట్లకు నీరు అందడం లేదని అరవింద్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల సంపద లక్ష కోట్లతో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టును ఏం చేద్దామనుకుంటున్నారని ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో అవినీతి చేసినవారు, ప్రస్తుతం కాపాడే వ్యక్తి బాగానే ఉన్నారంటూ మధ్యలో రైతులను ఎందుకు ఇబ్బంది పెడుతున్నారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. 2023లోనే కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై ఎన్డీఎస్ఏ నివేదిక ఇచ్చిందని, 2019 లోనే మూడు బ్యారేజీల వద్ద పనులు ప్రారంభించిన వెంటనే పగుళ్లు వచ్చాయని పేర్కొందని తెలిపారు. 2023 అక్టోబర్‌లో మేడిగడ్డ బ్యారేజీ వద్ద పిల్లర్లు ఇసుక కారణంగా కుంగిపోయాయని ఎన్డీఎస్ఏ వివరించిందన్నారు. డీపీఆర్ అనుమతులు లేకుండానే కాళేశ్వరం నిర్మించారని, ఈ బ్యారేజీలను ముందస్తు ప్రణాళిక ప్రకారం కాక వేరేచోట నిర్మించారని ఆరోపించారు. కాంట్రాక్టర్లకు కమీషన్లు ఇవ్వాలనే ఆతృతతో ఆగంఆగంగా నిర్మించారని తెలిపారు. డిజైన్లు ఎందుకు మార్చారు.. అందుకు సంబంధించిన ఫైల్లు అడిగితే జవాబు ఇవ్వలేదని ఎంపీ మండిపడ్డారు. అన్నారం, సుందిళ్ల కూడా మేడిగడ్డ మాదిరిగానే ఉన్నాయన్నారు. మూడు బ్యారేజీలను పూర్తిగా పరిశీలించి అవసరమైనచోట రిపేర్లు చేయాలని ఎన్డీఎస్ఏ సూచించిందని వివరించారు.

# ప్రతీ విద్యార్థి నుంచి అభిప్రాయ సేకరణ

**హైదరాబాద్, జూలై 23 :**



యూనిఫాంలు పంపిణీ చేసిన తర్వాత వాటి నాణ్యత, సైజు ఇతర అంశాలపై ప్రతీ విద్యార్థి నుంచి వాట్సాప్ ద్వారా అభిప్రాయ సేకరణ (ఫీడ్ బ్యాక్) తీసుకుంటామని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తెలిపారు. దాని ఆధారంగా వచ్చే ఏడాది పంపిణీ, వాటి రంగులు ఇతర అంశాలపై నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు. విద్యార్థులకు యూనిఫాంల అందజేతపై ఎంసీఆర్‌హెచఆర్డీలో గురువారం ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలు, వసతిగృహాల్లో చదివే విద్యార్థులకు అందజేసే యూనిఫాంల నాణ్యతలో రాజీపడమని స్పష్టం చేశారు. ఆగస్టు 15 నాటికి పిల్లలందరికీ యూనిఫాం అందజేయాల్సినదేనని అధికారులను ఆదేశించారు. ఈ విషయంలో అలసత్వం వహిస్తే సహించనని హెచ్చరించారు. మహిళా సంఘాలు కుట్టు పని వేగవంతం చేసేలా కలెక్టర్లతో సమన్వయం చేసుకోవాలని సెర్ప్ సీఈవో దివ్యకు సీఎం సూచించారు.

గత ప్రభుత్వ హయాంలో విద్యార్థులకు యూనిఫాంల అందజేతలో అడ్డగోలుగా వ్యవహరించారని సీఎం అన్నారు. తాము వ్యవస్థను ప్రక్షాళన చేస్తున్నామని, నాణ్యమైన యూనిఫాంలు అందిస్తామని తెలిపారు. పేద పిల్లల కోసం పని చేస్తున్నామనే అంశాన్ని దృష్టిలో ఉంచుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు. వచ్చే సంవత్సరం జూన్ 2నాటికే విద్యార్థులకు యూనిఫాం అందేలా కార్యాచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. సమీక్షలో ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి, స్పెషల్ చీఫ్ సెక్రటరీ సబ్యసాచి ఘోష్, సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ ఎన్.శ్రీధర్, సీఎం ఓఎస్డీ వేముల శ్రీనివాసులు, ఆయా శాఖల అధికారులు బాలమాయాదేవి, షఫీ ఉల్లా, విజయేంద్ర బోయి, దివ్య తదితరులు పాల్గొన్నారు.

**నీటి వనరులను అనుసంధానించాలి : వాటర్ బోర్డుపై సమీక్షలో సీఎం**

క్యూర్ పరిధిలో తాగు నీటి సరఫరాకు సంబంధించి సమగ్ర తాగు నీటి సరఫరా మాస్టర్ ప్లాన్‌ను రూపొందించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. జీహెచ్ఎంసీ, ఎంఎంసీ, సీఎంసీలతోపాటు విలీన మున్సిపాలిటీల్లోనూ తాగు నీటి సరఫరాలో ఏకరూపత ఉండాలన్నారు. రానున్న 50 ఏళ్ల అవసరాలకు తగినట్లు మాస్టర్ ప్లాన్ ఉండాలని సూచించారు. హైదరాబాద్ మహా నగర తాగు నీటి సరఫరా, సీవరేజీ బోర్డు పరిధిలోని పనులపై ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఎంసీహెచ్‌ఆర్డీలో గురువారం రాత్రి సమీక్షించారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావం నెలకొనడంతో తాగునీటి సరఫరాపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, హైదరాబాద్ చుట్టూ ఉన్న తాగు నీటి వనరులను అనుసంధానించాలని సీఎం సూచించారు. ఏదైనా కారణాలతో ఒక సోర్స్ నుంచి నీరు సరఫరా కాకపోయినా మరో సోర్స్ నుంచి వచ్చే నీటిని ఆయా ప్రాంతాలకు సరఫరా చేసేందుకు అనుసంధానత ఉపయోగపడుతుందన్నారు. జీహెచ్ఎంసీ పరిధిలో ఎన్నో ఏళ్లుగా పలు ప్రాంతాల్లో మూడు నాలుగు రోజులకొకసారి తాగు నీరు సరఫరా చేస్తున్నారని, ఇక ముందు ఆ పరిస్థితి ఉండకూడదని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఆయా ప్రాంతాలకు రోజు విడిచి రోజు నీరు సరఫరా చేసేందుకు అవసరమైన చర్యలు వెంటనే చేపట్టాలని ఆదేశించారు. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న తాగు నీటి సరఫరా పనులను ఏడాదిన్నరలోపు కచ్చితంగా పూర్తి చేయాలని అధికారులకు తేల్చిచెప్పారు. ఎస్టీపీల నిర్మాణ పనులపై ఆరా తీశారు. వాటిని నిర్దేశిత సమయంలో పూర్తి చేయాలని సీఎం ఆదేశించారు. ఎక్కడైనా న్యాయపరమైన సమస్యలు ఉంటే వాటిని వేగంగా పరిష్కరించుకునేందుకు ప్రయత్నించాలన్నారు. తాగు నీటి సరఫరా పనులు, ఎస్టీపీల నిర్మాణ పనుల ప్రగతిపై ప్రతి నెలా తనకు నివేదిక సమర్పించాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. పనుల పురోగతి తెలుసుకునేందుకు వీలుగా డ్యాష్ బోర్డును ఏర్పాటు చేయాలన్నారు. రానున్న రోజుల్లో పరిశ్రమలు, వివిధ నిర్మాణ పనుల్లో గ్రే వాటర్ వాడేలా నిబంధనలు రూపొందించి అమలు చేయాలని సీఎం సూచించారు. సమీక్షలో ఎంఏ యూడీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జయేష్ రంజన్, సీఎం సెక్రటరీ మాణిక్ రాజ్, హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ ఎండీ అశోక్ రెడ్డి, జేఎండీ మయాంక్ మిట్టల్ తదితరులు పాల్గొన్నారు.




## గ్రేటర్ ఎన్నికలకు

# హైకోర్టు బ్రేక్

- **జీహెచ్ఎంసీ ఎన్నికల నోటిఫికేషన్‌పై తాత్కాలిక స్టే.. వార్డుల పునర్విభజనపై కోర్టు ఆదేశాలు**
- **జీహెచ్ఎంసీ ఎన్నికల నోటిఫికేషన్‌పై హైకోర్టు తాత్కాలిక స్టే**
- **వార్డుల పునర్విభజన పూర్తయ్యే వరకు ఎన్నికల ప్రక్రియ నిలిపివేత**
- **రాష్ట్ర ప్రభుత్వం, ఎన్నికల సంఘానికి కోర్టు కీలక ఆదేశాలు**
- **వార్డుల విభజనపై పిటిషనర్ల అభ్యంతరాల పరిశీలన**
- **తాజా పరిణామాలతో రాజకీయ వర్గాల్లో చర్చ**

**హైదరాబాద్, జూలై 23**

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) ఎన్నికల నిర్వహణకు సంబంధించి తెలంగాణ హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. వార్డుల పునర్విభజన ప్రక్రియను చట్టబద్ధంగా పూర్తి చేసి, సరిహద్దులను శాస్త్రీయంగా నిర్ణయించే వరకు ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయవద్దని రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని ఆదేశిస్తూ తాత్కాలిక స్టే విధించింది. దీంతో జీహెచ్ఎంసీ ఎన్నికల ప్రక్రియ తాత్కాలికంగా నిలిచిపోయింది.

**వార్డుల పునర్విభజనపై అభ్యంతరాలు**

జీహెచ్ఎంసీ వార్డుల పునర్విభజన ప్రక్రియలో నిబంధనలు పాటించలేదంటూ దాఖలైన పిటిషన్లపై విచారణ చేపట్టిన హైకోర్టు, పిటిషనర్లు లేవనెత్తిన అంశాలను పరిశీలించింది. జనాభా ప్రాతిపదికన శాస్త్రీయంగా వార్డుల సరిహద్దులు నిర్ణయించాల్సి ఉండగా, ప్రస్తుత ప్రక్రియలో పలు లోపాలు ఉన్నాయని పిటిషన్లలో పేర్కొన్న విషయాలను కోర్టు పరిగణనలోకి తీసుకుంది.

**రాజకీయంగా చర్చకు దారితీసిన పరిణామం**

హైకోర్టు తాజా ఆదేశాలు రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారాయి. అధికార కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రతిపక్ష పార్టీలు విమర్శలు గుప్పిస్తుండగా, ప్రభుత్వం చట్టపరమైన ప్రక్రియను అనుసరిస్తోందని అధికార వర్గాలు చెబుతున్నాయి. జీహెచ్ఎంసీ ఎన్నికల షెడ్యూల్‌పై ఈ పరిణామం ప్రభావం చూపే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

**ఎన్నికల నిర్వహణపై అనిశ్చితి**

హైకోర్టు ఆదేశాల మేరకు వార్డుల పునర్విభజన ప్రక్రియను తిరిగి పూర్తి చేసిన అనంతరమే ఎన్నికల నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశం ఉంది. ఈ ప్రక్రియకు మరికొంత సమయం పట్టే అవకాశం ఉండటంతో గ్రేటర్ ఎన్నికల నిర్వహణపై అనిశ్చితి నెలకొంది. తదుపరి విచారణలో హైకోర్టు ఇచ్చే ఆదేశాలపై ఎన్నికల ప్రక్రియ భవిష్యత్తు ఆధారపడి ఉండనుంది.

# దేశంలో అలజడులకు కాంగ్రెస్, లెఫ్ట్ పార్టీల కుట్ర

- **బీజేపీ అధ్యక్షుడు రామచందర్‌రావు**

**హైదరాబాద్, జూలై 23 :**

దేశంలో అశాంతిని సృష్టించి యువతను రెచ్చగొట్టడం ద్వారా మోదీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వాన్ని దెబ్బతీయడానికి కాంగ్రెస్, వామపక్షాలు, విదేశీ విచ్ఛిన్నకర శక్తులు పెద్ద ఎత్తున కుట్ర పన్నుతున్నాయని బీజేపీ¾ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్ రావు తీవ్రంగా మండిపడ్డారు. పార్టీ రాష్ట్ర కార్యాలయంలో గురువారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ శ్రీలంక, నేపాల్, బంగ్లాదేశ్ తరహాలో భారతదేశంలో కూడా అశాంతిని, హింసను సృష్టించేందుకు కొన్ని అల్ట్రాలెఫ్ట్, సాఫ్ట్‌లెఫ్ట్ శక్తులు, ఎసఎఫఐ, ఏఐఎసఎఫ్, ఏఎసఏ వంటి పాత సంఘాల నాయకులు కొత్త పేర్లతో కాక్రోచ్ జనతా పార్టీ వంటి వేదికలను ఏర్పాటు చేస్తున్నారని ఆరోపించారు. పలుచోట్ల జరిగిన కార్యక్రమాల వెనుక ఈ శక్తుల హస్తం ఉందన్నారు. ఈ ఉద్యమాలకు ఖలిస్తాన్ శక్తుల నుంచి రూ.10 కోట్లు, కతార్, కెనడా, పాకిస్తాన్, బంగ్లాదేశ్‌ల నుంచి ఆర్థిక, వ్యూహాత్మక మద్దతు అందుతోందని ఆరోపించారు. ఏ ఖలిస్తానీ శక్తులైతే రాహుల్ గాంధీ నానమ్మను పొట్టనబెట్టుకున్నాయో అదే శక్తులతో రాహుల్ గాంధీ జతకట్టడం సిగ్గుచేటని విమర్శించారు. 'నీట' మోదీ ప్రభుత్వ పారదర్శక చర్యలు 'నీట' పేపర్ లీకేజీపై రామచందర్‌రావు మాట్లాడుతూ లీకేజీ విషయం తెలిసిన వెంటనే ప్రభుత్వం తక్షణమే స్పందించి 31 మందిని అరెస్టు చేసిందని గుర్తు చేశారు. మహారాష్ట్ర, ఇతర ప్రాంతాల్లో కాంగ్రెస్ అనుకూల వ్యక్తులే ఈ లీకేజీకి కారణమని తేలిందన్నారు. విద్యార్థులకు ఎలాంటి అన్యాయం జరగకుండా ప్రభుత్వం రీఎగ్జామ్ నిర్వహించిందని, ఏ ఒక్క విద్యార్థి కూడా దీనిపై రోడ్డు మీదకొచ్చి నిరసన తెలపలేదని ఆయన అన్నారు. గతంలో పరీక్షల పేపర్ లీక్ అయితే 420 కేసులు పెట్టి వదిలేసేవారని, కానీ మోదీ ప్రభుత్వం 2024లో ప్రివెన్షన్ ఆఫ్ అన్‌ఫెయిర్ మీన్స్ ఇన్ పబ్లిక్ ఎగ్జామినేషన్స్ యాక్ట్ తీసుకొచ్చి రూ.కోటి జరిమానాతోపాటు కఠిన శిక్షలు అమలులోకి తెచ్చిందని చెప్పారు. ప్రొఫెసర్ రాధాకృష్ణన్ నేతృత్వంలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ)ని బలోపేతం చేసి సంస్కరణలు అమలు చేస్తోందని తెలిపారు. య□పీఏ పాలనలోనే రికార్డు స్థాయి లీకేజీలువిద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాను డిమాండ్ చేస్తున్న కాంగ్రెస్ శక్తులు తమ గత చరిత్రను గుర్తు చేసుకోవాలని రామచందర్‌రావు హితవు పలికారు. 2014కు ముందు యూపీఏ ప్రభుత్వ హయాంలోనూ, కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు(టీఎంసి, డీఎంకే, ఎస్పీ, బీఆరఎస్ మొదలైనవి) పాలించిన రాష్ట్రాల్లో సుమారు 53కంటే ఎక్కువ ప్రధాన పరీక్షల పేపర్లు లీక్ అయ్యాయని వివరించారు.

2005 నుండి 2014 వరకు సీబీఎసఈ, ఎయిమ్స్, ఆరఆర్‌బీ, ఎసఎస్సీ, బ్యాంకింగ్ వంటి అనేక జాతీయస్థాయి పరీక్షల పేపర్లు లీక్ అయ్యాయని ఆధారాలు చూపారు. ఆ సమయంలో ఏనాడైనా కాంగ్రెస్ లేదా నాన్‌బీజేపీ ప్రభుత్వాల విద్యాశాఖ మంత్రులు రాజీనామాలు చేశారా అని ఆయన ప్రశ్నించారు.ఉద్యోగాలు, ఉపాధి కల్పనలో ఎన్డీయే కొత్త చరిత్ర2004 2014 మధ్య య□పీ¾ఏ ప్రభుత్వం 2.9 కోట్ల ఉద్యోగాలు సృష్టిస్తే 20142024 మధ్య మోదీ ప్రభుత్వం 17 కోట్ల ఉద్యోగ అవకాశాలను సృష్టించిందన్నారు. ఎన్డీయే పాలనలో ఇప్పటివరకు 12 లక్షలకు పైగా నియామక పత్రాలు అందజేశామని, 19 రోజ్‌గార్ మేళాల ద్వారా నిరంతరం నియామకాలు జరుగుతున్నాయని రామచందర్‌రావు తెలిపారు. 201718లో 6%గా ఉన్న నిరుద్యోగిత రేటు 2025 నాటికి 3.1%కి తగ్గిందని, ఎంప్లాయ్‌మెంట్ రేటు 46.8% నుండి 57.4%కి పెరిగిందని వెల్లడించారు. 2014 తర్వాత ఐఐటీ, ఐఐఎమ్, ఎయిమ్స్, ఎనఐటీ, మెడికల్ కళాశాలల సంఖ్యను రెట్టింపు చేశామని, ఉన్నత విద్యలో విద్యార్థుల నమోదు 4.5 కోట్లకు పైగా పెరిగిందని వివరించారు. వికసిత్ భారత్, ముద్ర యోజన, స్టార్టప్ ఇండియా ద్వారా కోట్లాది మంది యువతకు స్వయం ఉపాధి లభించిందన్నారు.



# యువత ఆక్రోశానికి సమాధానమేదీ?

పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు సోమవారం ప్రారంభం అయ్యాయి. వరుసగా నాలుగోరోజు కూడా ఉభయ సభల్లో గందరగోళం నెలకొంది. సమావేశాలు సజావుగా సాగడం లేదు. నీట్ లీకేజీపై ధర్మేంధ్ర ప్రధాన్ రాజీనామా చేయాలన్న డిమాండ్‌తో కాక్రోచ్ జనతాపార్టీ ఆందోళనలకు దిగింది. నీట్ లీకేజీకి బాధ్యతగా కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలన్న డిమాండ్‌తో సంసద్ చలో ఆందోళనకు పిలుపునిచ్చింది. వారి ఆందోళనలో వందశాతం న్యాయం ఉంది. ఎందుకంటే పరీక్షలను కూడా సక్రమంగా నిర్వహించలేని అసమర్థులు...పాలకులు అయినప్పుడు ప్రజలు స్పందిస్తారు. నిలదీస్తారు. నీట్ పరీక్ష వల్ల జరిగిన గందరోగళం ఎందరినో బలితీసుకుంది. ఎందరో తల్లిదండ్రులు క్షోభకు గురయ్యారు. దీనిని ఓ చిన్న సమస్యగా ప్రభుత్వం భావించి ఉండవచ్చు. కానీ విద్యార్థులకు మాత్రం ఇది జీవన్మరణ సమస్య. ఇకపోతే నాలుగు రోజులుగా గందరగోళం జరుగుతున్నా ప్రధాని మోడీ మౌనం వీడడం లేదు. కేవలం ఎక్స్ వేదికగా కఠినంగా వ్యవహరిస్తామని, నీట్ దోషుల కోసం ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేస్తామని ప్రకటించి చేతులు దులుపుకున్నారు. దేశంలో ఓ పెద్ద ఆందోళన జరుగుతంటే ఇదేనా ప్రధానిగా ఉన్న వ్యక్తి చేయాల్సిన పని. మణిపూర్ అల్లర్లు, ఢిల్లీలో రైతుల ఆందోళన, నీట్ పరీక్షా పేపర్ లీకేజీ, అయోధ్య విరాళాల చోరీ..ఇటీవల వరుసగా జరిగిన సంఘటనలు దేశాన్ని కుదిపేస్తున్నాయి. వీటిపై పార్లమెంటులో చర్చించడం జరగాలి. ప్రధాని మోడీ మౌనం వీడి పార్లమెంట్‌కు వచ్చి, నేరుగా సమాధానం చెప్పాల్సిన ముఖ్యమైన అంశాలు. దివంగత ప్రధాని మన్మోహన్ సింగ్‌ను మౌనమునిగా విమర్శించిన మోడీ ఇప్పుడు అంతకు మించి మౌనంగా మారారు. పార్లమెంట్ జరుగుతన్నా రాకుండా చోద్యం చూస్తూ ఎక్స్‌లో పోస్టులు పెట్టడం సరికాదు. ఇక్కడ సమాధానం చెప్పడం అంటే దేశప్రజలకు సమాధానం చేరవేయడంగా గుర్తించాలి. బాధ్యతగల ప్రధానిగా మోడీ పార్లమెంట్‌కు వచ్చి సమాధానం ఇవ్వాలి. కానీ అలా జరగడం లేదు. ఇంతకన్నా దౌర్భాగ్యం మరోటి లేదు. ఆయన వందిమాగధులు ఇదంతా విపక్షాలతో తమకున్న పంచాయితీలాగా సవాళ్లు విసరుతున్నారు. దేశం తీవ్ర ఆందోళనలో ఉంటే ఇదేనా పాలక పార్టీ వ్యవహరించే తీరు. ఇకపోతే దేశంలోని వ్యవస్థల్లో అవినీతి పాతుకుపోయిందనడానికి నీట్ పేపర్ లీకేజీ వంటివి పరాకాష్టగా చూడాలి. అవినీతి అన్నది రాజకీయ నాయకుల హక్కుగా మారింది. ప్రజలను ఏమార్చి, అధికారం చేపట్టగానే, ఓటు బ్యాంకు రాజకీయాలు తప్ప దేశహితం, దేశాన్ని ముందుకు తీసుకుని వెళ్లేందుకు అసవరమైన నిర్ణయాలు తక్కువే జరుగుతున్నాయి. ఇటీవల రామమందిరంలో విరాళాల చోరీ ఘటన తెలిసిందే. అవినీతి కేసుల్లో దోషులకు మరణశిక్ష విధించాలి. అవినీతి సాధారణమేనని సగటు భారత పౌరులు ఆలోచించే పరిస్థితి నెలకొన్నది. దొరికే వరకు కూడా ఇది తప్పు అని కూడా భావించడంలేదు. వ్యవస్థలో అవినీతిని రూపుమాపాలని ప్రభుత్వం నిజంగా భావిస్తే, చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలి. చట్టాన్ని సవరించాలి. దోషులకు మరణ శిక్ష విధించేలా మార్పులు చేయాలి. ఉన్న చట్టాలతోనే కఠిన శిక్షలు విధించాలి. ఇకపోతే దేశంలో విద్యా వ్యవస్థ తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయిందనడంలో ఎలాంటి సందేహం అక్కర్లేదు. గత పదేళ్లలో ఏకంగా 152 పోటీ పరీక్షల ప్రశ్నాపత్రాలు లీక్ అయ్యాయని లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ ఆరోపించారు. సగటున నెలకు ఒక పేపర్ లీక్ అవుతున్నా బాధ్యులైన వారికి పడిన శిక్షలు మాత్రం సున్నా అని ధ్వజమెత్తారు. నిజంగానే ఇది ముమ్మాటికీ నిజం. నీట్ ప్రశ్నాపత్రాల లీకేజీకి నిరసనగా శాంతియుతంగా ఆందోళన చేస్తున్న విద్యార్థులపై పోలీసులు లాఠీఛార్జ్ చేయడానికి ముందే ప్రధాని మోడీ పార్లమెంటులో స్పందించి ఉంటే ఈ గందరగోళం చెలరేగేది కాదు. ప్రతి ఆందోళనను రాజకీయ కోణంలో చూడడం, విపక్షాలను తిట్టిపోయడం వల్ల సమస్యలను పాలకులు గుర్తించడం లేదు. ఒకప్పుడు ప్రపంచానికే ఆదర్శంగా నిలిచిన భారత విద్యా వ్యవస్థ.. అక్రమాలు, లీకేజీలకు నిలయంగా మారింది. దేశంలో పేపర్ లీకేజీలు ఒక పెద్ద మాఫియాగా మారాయి. దీని వెనుక ఉన్న బడాబాబులపై ప్రభుత్వం చర్యలు తీసుకోవడంలో విఫలం అవుతూ వస్తోంది. జంతర్ మంతర్ వద్ద భారతీయ యువత నిరసనలను సీరియస్‌గా తీసుకోవాల్సి ఉండగా, దానిని అణచివేయడం ఎలా అన్న ఆలోచననే అధికారపక్షం ఆలోచన చేయడం సరికాదు. నిరసనల్లో లక్ష మందికి పైగా యువకులు, విద్యార్థులు పాల్గొని ఉంటారని ఫోటోలు స్పష్టంగా సూచిస్తున్నాయి. తొలుత ఒక మార్చ్‌గా అనుకున్నది తరువాత నిరసన ప్రదర్శనగా పరిణమించింది. ఎంతోకాలంగా ఆగ్రహంతో ఉన్న యువత ఈ అవకాశాన్ని అనుకూలంగా తీసుకుని, వెల్లువెత్తి జనసంద్రంగా మారినట్లు మనకు కనిపిస్తోంది. మన దేశంలో రాజకీయ పార్టీల ర్యాలీలకు డబ్బులు, ఇతర ప్రలోభాలతో జనాన్ని సమీకరించడం పరిపాటి. అయితే ఈ నిరసన ప్రదర్శన అలా జరగలేదు. జంతర్ మంతర్‌కు చేరిన వారందరూ తమకు తాముగా స్వచ్ఛందంగా వచ్చినవారే. ప్రతి ఒక్కరూ సామాజిక మాధ్యమాలలో విజ్ఞప్తులకు ప్రతిస్పందించి స్వచ్ఛందంగా వచ్చినవారే. ఎవరి ప్రయాణ ఏర్పాట్లు వారే చేసుకుని, సుదూర ప్రాంతాల నుంచి నడిచి వచ్చినవారు చాలామంది ఉన్నారు. ఇంకో ముఖ్య విషయమేమంటే వచ్చిన వారిలో యువ మహిళల శాతం అత్యధికంగా ఉండడం. ఈ నిరసన ప్రదర్శనలో పాల్గొన్నవారిలో అత్యధికులు ఇటువంటి నిరసనలలో తొలిసారి పాల్గొన్నవారే కావడం మరో వాస్తవం. కేవలం నీట్ తదితర ప్రశ్నపత్రాల లీక్‌కు రగిలిపోయి మాత్రమే యువత జంతర్ మంతర్ వద్ద ధర్నాకు రాలేదని ఖచ్చితంగా చెప్పవచ్చు. దేశంలో పెచ్చరిల్లుతోన్న నిరుద్యోగం, అవినీతిమయమైన అధికార వ్యవస్థలు, రాజకీయ పార్టీల కపటాలు అన్నీ కలగలిపి వారిని ఈ నిరసనలో పాల్గొనేలా ప్రోత్సహించాయనే చెప్పాలి. విద్యాభ్యాసాన్ని పూర్తిచేసుకుని ఉద్యోగాలను వెతుక్కుంటున్న వారు, నియామకాలలో అవకతవకలకు బాధితులైనవారు ఎందరో ఆ నిరసనకారుల్లో ఉన్నారని చెప్పక తప్పదు. దేశ పాలనావ్యవస్థల్లో అవినీతి మితిమీరి, రాజకీయ అవినీతి పెరిగి పోవడం, పాలకుల విలాసాలు, ప్రజలేమో అవస్థల పాలవుతున్న తీరు కారణంగా యువత నిరసనలకు ఉద్యమించిందని చెప్పక తప్పదు. దీనికి విదేశీ హస్తం ఉందనో లేదా మరే ఇతర కారణాలనో చూపి మసిపూసి మారేడుకాయ చేసే ప్రయత్నాలు కూడా మంచిది కాదు. సమస్యలను గుర్తించి పాలకులు తమ తీరును మార్చుకోవాలి. ఇది కేంద్ర రాష్ట్రాల పాలకులుకు ఓ హెచ్చరిక కావాలి. అలాగే ఈ యువ నిరసన ఒక ఆరంభం మాత్రమే. ఇది దావానలంలా విస్తరించినా ఆశ్చర్య పోనవసరం లేదు. పాలకులు బుద్ధి తెచ్చుకుని మారకపోతే యువత చరిత్ర సృష్టిస్తుందని చెప్పక తప్పదు.

# నేడు దేశవ్యాప్త నిరసనలకు సీజేపీ పిలుపు

- నీట్ పేపర్ లీక్‌పై కేంద్రం బాధ్యత వహించాలని డిమాండ్
- శాంతియుత ఆందోళనలకే పరిమితం కావాలని యువతకు సూచన
- ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల ప్రకటన మధ్య మరో ఉద్యమానికి సిద్ధమైన సీజేపీ



**న్యూఢిల్లీ, జూలై 23:** నీట్ పేపర్ లీక్ వ్యవహారంలో కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించాలని డిమాండ్ చేస్తూ ఉద్యమిస్తున్న కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) జులై 24న దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు నిర్వహించాలని పిలుపునిచ్చింది. ఇటీవల జంతర్‌మంతర్--పార్లమెంట్ ర్యాలీ సందర్భంగా విద్యార్థులు, యువతపై జరిగిన పోలీసు చర్యలకు నిరసనగా ఈ కార్యక్రమాలు చేపడుతున్నట్లు పార్టీ వెల్లడించింది. దేశవ్యాప్తంగా నిరసనల నిర్వహణకు అవసరమైన అనుమతులు, ఇతర ఏర్పాట్లను స్థానికంగా పూర్తి చేసుకోవాలని యువత, విద్యార్థి సంఘాలు, యువజన సంస్థలకు సీజేపీ సూచించింది. నీట్ పేపర్ లీక్ వ్యవహారంలో పార్టీ డిమాండ్లను బహిరంగంగా ప్రజలకు వివరించాలని కోరింది. నిరసనల్లో బాధిత విద్యార్థులకు సంఘీభావంగా "ఇంక్విలాబ్ జిందాబాద్", "భారత్ మాతాకీ జై" వంటి నినాదాలు మాత్రమే చేయాలని, ఎలాంటి రెచ్చగొట్టే వ్యాఖ్యలు లేదా ఉద్రిక్తతలకు దారితీసే చర్యలకు పాల్పడవద్దని పార్టీ సూచించింది. అనుమతి పొందిన ప్రాంతాల్లోనే నిరసనలు నిర్వహించాలని, ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చూసుకోవాలని, ఎలాంటి ప్రేరేపణలకు స్పందించవద్దని పిలుపునిచ్చింది. ఇదిలా ఉండగా, నీట్ పేపర్ లీక్ వ్యవహారంలో దోషులపై వేగంగా విచారణ పూర్తి చేసేందుకు ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమవుతున్నట్లు ఇప్పటికే ప్రకటించిన విషయం తెలిసిందే.

# దమ్ముంటే నీట్‌పై పార్లమెంట్‌లో చర్చకు రావాలి

- విపక్షాలకు బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ సవాల్
- విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన ఏ అంశంపైనా చర్చకు సిద్ధమన్న ఎన్డీఏ
- రాహుల్ గాంధీ సభలో చర్చను తప్పించుకుంటున్నారని ఆరోపణ



**న్యూఢిల్లీ, జూలై 23:** నీట్ పరీక్ష, పేపర్ లీకేజీ వ్యవహారంపై పార్లమెంట్ వేదికగా బహిరంగ చర్చకు విపక్షాలు సిద్ధమా అని భారతీయ జనతా పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ సవాల్ విసిరారు. విద్యార్థులు, యువత భవిష్యత్తుకు సంబంధించిన ప్రతి అంశంపైనా చర్చించేందుకు ఎన్డీఏ ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆయన పేర్కొన్నారు. మీడియాతో మాట్లాడుతూ లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీతో పాటు ఇండియా కూటమి పార్టీలు పార్లమెంట్‌లో చర్చకు ముందుకు రావడం లేదని, సభలో చర్చ జరిగితే వారి వైఖరి ప్రజల ముందుకు వస్తుందనే భయంతోనే వెనకడుగు వేస్తున్నారని ఆరోపించారు. నీట్ పేపర్ లీకేజీ కేసుల్లో దోషులకు కఠిన శిక్షలు విధించేందుకు ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేస్తామని ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటించిన నేపథ్యంలో రాహుల్ గాంధీ చేసిన విమర్శలకు ప్రతిస్పందిస్తూ నితిన్ నబిన్ ఈ వ్యాఖ్యలు చేశారు."విద్యార్థులు, యువత భవిష్యత్తుకు సంబంధించిన ఏ అంశంపైనైనా పార్లమెంట్‌లో చర్చించేందుకు మేము సిద్ధంగా ఉన్నాం. నీట్ సహా అన్ని అంశాలపై చర్చకు విపక్షాలు ముందుకు రావాలి" అని ఆయన అన్నారు. రాహుల్ గాంధీ రాజకీయ ప్రస్థానం అంతా బాధ్యత నుంచి తప్పించుకోవడమేనని, కాంగ్రెస్ పార్టీ దశాబ్దాలుగా యువతను తప్పుదారి పట్టించిందని నితిన్ నబిన్ విమర్శించారు. పార్లమెంట్‌లో చర్చ జరిగితే తమ వైఖరి బయటపడుతుందనే కారణంతోనే విపక్షాలు చర్చను నివారిస్తున్నాయని ఆయన ఆరోపించారు. యువతను నిరసనలకు మాత్రమే పరిమితం చేసే రాజకీయానికి బదులుగా, వారికి సురక్షితమైన, ఉజ్వలమైన భవిష్యత్తు కల్పించడమే ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వ లక్ష్యమని నితిన్ నబిన్ స్పష్టం చేశారు.

# ఢిల్లీలో మెట్రో స్టేషన్ల మూసివేతపై సుప్రీంకోర్టు అసంతృప్తి

## మధ్యాహ్నంలోగా పరిస్థితి సరిచేయాలి : సీజేఐ



**న్యూఢిల్లీ, జూలై 23:** సీజేపీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న నిరసనల నేపథ్యంలో ఢిల్లీలో పలు మెట్రో స్టేషన్లను మూసివేయడంపై భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. సామాన్య ప్రజలతో పాటు సుప్రీంకోర్టుకు వచ్చే న్యాయవాదులు, వ్యాజ్యదారులు, కోర్టు సిబ్బంది తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొంటూ, మధ్యాహ్నంలోగా పరిస్థితిని సరిదిద్దకపోతే సుప్రీంకోర్టు జోక్యం చేసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. సీజేపీ చేపట్టిన నిరసనలను దృష్టిలో ఉంచుకుని ఢిల్లీ మెట్రో రైల్ కార్పొరేషన్ వరుసగా రెండో రోజూ 16 మెట్రో స్టేషన్లను మూసివేసింది. దీంతో వేలాది మంది ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మెట్రో స్టేషన్ల మూసివేత వల్ల సుప్రీంకోర్టుకు వచ్చే న్యాయవాదులు, వ్యాజ్యదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొంటూ బార్ అసోసియేషన్ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి స్పందించారు. మధ్యాహ్నం వరకు పరిస్థితిని పరిశీలిస్తామని, అప్పటికీ సమస్య పరిష్కారం కాకపోతే కోర్టు తగిన ఆదేశాలు జారీ చేసే అంశాన్ని పరిశీలిస్తామని తెలిపారు. ఇదిలా ఉండగా, జంతర్‌మంతర్ వద్ద సీజేపీ ఆధ్వర్యంలో నిరసనలు కొనసాగుతున్నాయి. ప్రశ్నపత్రాల లీకేజీలకు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని నిరసనకారులు డిమాండ్ చేస్తున్నారు. మరోవైపు పరిస్థితిని అదుపులో ఉంచేందుకు ఢిల్లీ పోలీసులు భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. నీట్ పేపర్ లీకేజీ వ్యవహారం పార్లమెంట్‌లోనూ ప్రతిధ్వనిస్తుండగా, అధికార, ప్రతిపక్ష సభ్యుల ఆందోళనలతో ఉభయ సభల కార్యకలాపాలు పలుమార్లు అంతరాయం చెందాయి.

# విద్యార్థులతో కేంద్రం చర్చలు జరపాలి

## జంతర్‌మంతర్ నిరసనలపై స్పందించిన కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ

## ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్

## విద్యా వ్యవస్థ ప్రక్షాళనకు కొత్త బిల్లు తీసుకురావాలని సూచన



**న్యూఢిల్లీ, జూలై 23:** పేపర్ లీకేజీలు, విద్యా వ్యవస్థలో లోపాలపై జంతర్‌మంతర్ వద్ద ఆందోళన చేస్తున్న విద్యార్థులతో కేంద్ర ప్రభుత్వం నేరుగా చర్చలు జరపాలని కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ కోరారు. విద్యార్థులు ప్రస్తుత పరీక్షల వ్యవస్థపై నమ్మకం కోల్పోయారని, వారి సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం వెంటనే స్పందించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. విద్యార్థుల డిమాండ్లను వినాల్సిన బాధ్యత ప్రభుత్వంపైనే ఉందని ప్రియాంక పేర్కొన్నారు. వ్యవస్థ అందించే అరకొర పరిష్కారాలను విద్యార్థులు ఇకపై అరె కరించే పరిస్థితిలో లేరని వ్యాఖ్యానించారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే రాజీనామా చేయాలని, నిరసన తెలుపుతున్న విద్యార్థులపై జరిగిన లాఠీఛార్జ్ ఘటనపై సమగ్ర విచారణ జరిపించాలని ఆమె డిమాండ్ చేశారు. "సోషల్ మీడియాలో విద్యార్థులపై నమ్మకం ఉందని చెబుతూ, మరోవైపు వారిపై లాఠీఛార్జ్ చేయించడం సరైంది కాదు. నిజంగా విద్యార్థులపై శ్రద్ధ ఉంటే వారిని పిలిచి మాట్లాడాలి" అని కేంద్ర ప్రభుత్వాన్ని ఉద్దేశించి ప్రియాంక గాంధీ వ్యాఖ్యానించారు. ప్రభుత్వ తీరును విమర్శిస్తూ ఒక ఉదాహరణను ప్రస్తావించిన ఆమె, "పిల్లలు డిజైనర్ కావాలనుకుంటే వారి మాట వినకుండా ఇంజినీరింగ్ కాలేజీలో సీటు బుక్ చేసినట్లు ప్రభుత్వ వైఖరి కనిపిస్తోంది" అని అన్నారు. జంతర్‌మంతర్ వద్ద వేలాదిగా చేరిన యువత ఆవేదనను రాజకీయాలకు అతీతంగా వినాలని, విద్యా వ్యవస్థను సమూలంగా ప్రక్షాళన చేసేలా సమగ్ర చట్టాన్ని పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలని ప్రియాంక గాంధీ కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.

# ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాపై ప్రతిపక్షాల పట్టు

- నీట్ అంశంపై దుమారం..
- నేటికి లోక్‌సభ వాయిదా
- రాజీనామా తర్వాతే చర్చ అంటున్న ప్రతిపక్షాలు
- చర్చ నుంచి తప్పించుకుంటున్నారంటూ విపక్షాలపై కేంద్రం విమర్శలు



**న్యూఢిల్లీ, జూలై 23:** నీట్ పేపర్ లీక్ వ్యవహారంపై పార్లమెంట్‌లో మరోసారి తీవ్ర ప్రతిష్ఠంభన నెలకొంది. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని ప్రతిపక్షాలు పట్టుబట్టడంతో లోక్‌సభను శుక్రవారానికి వాయిదా వేశారు. రాజ్యసభను మధ్యాహ్నం 3 గంటల వరకు వాయిదా వేశారు. లోక్‌సభ సమావేశం ప్రారంభమైన వెంటనే నీట్ పేపర్ లీక్ అంశంపై ప్రభుత్వం బాధ్యత వహించాలని, విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని ప్రతిపక్ష సభ్యులు డిమాండ్ చేశారు. నిరసనల మధ్య సభ పలుమార్లు వాయిదా పడింది. సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్ మాట్లాడుతూ, పేపర్ లీక్ జరిగినట్లు ప్రభుత్వం అరె కరిస్తే వెంటనే ధర్మేంద్ర ప్రధాన్ పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే మాట్లాడుతూ, రూల్--267 కింద చర్చ చేపట్టాలని ప్రతిపక్షాలు కోరుతున్నప్పటికీ ప్రభుత్వం అరె కరించడం లేదన్నారు. రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలను కేంద్ర ప్రభుత్వం అవమానించిందని ఆరోపించిన ఆయన, ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసిన తర్వాతే చర్చకు హాజరవుతామని స్పష్టం చేశారు. మరోవైపు ప్రతిపక్షాల వైఖరిపై కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు తీవ్ర విమర్శలు చేశారు. నీట్ అంశంపై పార్లమెంట్‌లో చర్చ జరగకుండా ప్రతిపక్షాలే అడ్డుకుంటున్నాయని ఆరోపించారు. చర్చకు ముందే షరతులు విధించడం సమంజసం కాదని పేర్కొంటూ, ఈ అంశంపై ప్రభుత్వానికీ తన వాదనను వినిపించే హక్కు ఉందన్నారు.

## గోపీనగర్‌లో అంగన్‌వాడీ వద్ద పొంగిపొర్లుతున్న మురుగు

**తక్షణ పరిష్కారం కోరుతున్న ప్రజలు**



**శేరిలింగంపల్లి, రాజముద్ర న్యూస్ :** గోపీనగర్ అంగన్‌వాడీ కేంద్రం సమీపంలో మురుగునీరు పొంగిపొర్లుతుండటంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రోజూ చిన్నారులు, గర్భిణీలు, బాలింతలు అంగన్‌వాడీకి వస్తున్న నేపథ్యంలో అపరిశుభ్రత వారి ఆరోగ్యంపై ప్రభావం చూపుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. దుర్వాసన వెదజల్లడంతో పాటు దోమలు, ఈగలు పెరిగి అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని ఆరోపించారు. ఈ సమస్యను పలుమార్లు అధికారుల దృష్టికి తెచ్చినా శాశ్వత పరిష్కారం లేదని వారు మండిపడ్డారు. వార్డు ప్రజాప్రతినిధులు, మున్సిపల్ అధికారులు వెంటనే స్పందించి మురుగును తొలగించి పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని, చిన్నారులు వ్యాధుల బారిన పడకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేశారు.

## బూత్ స్థాయి కార్యకర్తలే పార్టీ గెలుపుకు మూలస్తంభాలు

- నేలకొండపలి మండల బూత్ ఏజెంట్ల సమీక్షలో మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్ రెడ్డి
- బీఆర్ఎస్ ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపు



**ఖమ్మం రాజముద్ర న్యూస్:** పైనంపల్లి, పార్టీ గెలుపోటములను నిర్ణయించేది బూత్ స్థాయి కార్యకర్తలే అని పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్ రెడ్డి అన్నారు. ప్రతి బూత్ ఏజెంట్ శ్రేష్టమైన బాధ్యతతో పనిచేయాలనిపిలుపునిచ్చారు. బుధవారం పైనంపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ పార్టీ నేలకొండపల్లి మండల బూత్ ఏజెంట్ల సమీక్షా సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమానికి వచ్చిన కందాళ ఉపేందర్ రెడ్డికి పార్టీ శ్రేణులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "బీఆర్ఎస్ హయాంలో పాలేరు నియోజకవర్గంలో వేలాది కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు జరిగాయి. కేసీఆర్ అందించిన సంక్షేమ ఫలాలు ప్రతి ఇంటికి చేరాయి. రైతు బంధు, దళిత బంధు, కేసీఆర్ కిట్, ఆసరా పెన్షన్ల వంటి పథకాలు దేశానికే ఆదర్శం" అని అన్నారు."ఈ ఘనతలన్నింటినీ గడప గడపకు తీసుకెళ్లే బాధ్యత మీ అందరిపై ఉంది. ప్రతి బూత్ లో మన బలాన్ని పెంచుకునేందుకు కృషి చేయాలి" అని బూత్ ఏజెంట్లకు దిశా నిర్దేశం చేశారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను, ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు నెరవేరకపోవడాన్ని ప్రజాక్షేత్రంలో బలంగా ప్రశ్నించాలని పిలుపునిచ్చారు. "ధరలు పెరిగాయి, నిరుద్యోగం పెరిగింది, ఇచ్చిన హామీలు గాలికి ఎగిరిపోయాయి. వీటన్నింటిపై ప్రజల్లో చైతన్యం తీసుకురావాలి" అని అన్నారు. "పార్టీ కోసం పనిచేసే ఏ కార్యకర్తకు ఏ కష్టం వచ్చినా నేను అండగా ఉంటాను. మీ సమస్యలు నా సమస్యలు. కలిసికట్టుగా ముందుకు వెళ్లి మళ్లీ బీఆర్ఎస్ జెండా ఎగురవేద్దాం" అని కందాళ ఉపేందర్ రెడ్డి భరోసా ఇచ్చారు.ఈ సమావేశంలో నేలకొండపల్లి మండల బీఆర్ఎస్ మండల నాయకులు వున్నం బ్రహ్మయ్య, బెల్లం వేణు, మరికంటి ధనలక్ష్మి, సర్పంచులు వెంకటలక్ష్మి, రంగయ్య ఎల్లయ్య, మండలంలోని అన్ని గ్రామాల బూత్ ఏజెంట్లు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## శంకర్ పల్లిలో కాంగ్రెస్ ఆగ్రహ నిరసన



- ప్రజాస్వామ్య విలువల పరిరక్షణకు పిలుపు
- కేంద్ర ప్రభుత్వ వైఖరిపై తీవ్ర విమర్శలు
- మోదీ బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్
- భారీ సంఖ్యలో పాల్గొన్న కాంగ్రెస్ శ్రేణుల

**శంకర్ పల్లి, రాజముద్ర న్యూస్:** శంకర్ పల్లిలోని ఇంద్రారెడ్డి చౌరస్తా గురువారం కాంగ్రెస్ పార్టీ నాయకుల, కార్యకర్తల ఆగ్రహ నినాదాలతో హో రెత్తింది. రాహుల్ గాంధీపై కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న తీరును నిరసిస్తూ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. ఈ కార్యక్రమానికి శంకర్ పల్లి మండల కాంగ్రెస్ కమిటీ నూతన అధ్యక్షుడు బొల్లారం వెంకటరెడ్డి అధ్యక్షత వహించగా, మున్సిపల్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మడపతి చంద్రమౌళి ఆధ్వర్యంలో నిరసన నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ... ప్రతిపక్ష నాయకుడిని రాజకీయ కక్షసాధింపుతో లక్ష్యంగా చేసుకోవడం ప్రజాస్వామ్య స్ఫూర్తిని అవమానించడమేనని విమర్శించారు. విభిన్న అభిప్రాయాలను అణచివేసే ధోరణి దేశ ప్రజాస్వామ్య వ్యవస్థకు ప్రమాదకర సంకేతమని పేర్కొన్నారు. ప్రజల తరపున ప్రశ్నించే గొంతుకలను అణగదొక్కే ప్రతి ప్రయత్నాన్ని కాంగ్రెస్ తీవ్రంగా ప్రతిఘటిస్తుందని స్పష్టం చేశారు. రాహుల్ గాంధీకి జరిగిన అవమానానికి రాజకీయ బాధ్యత వహిస్తూ ప్రధాని నరేంద్ర మోదీ వెంటనే దేశ ప్రజల ముందు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యంలో విమర్శలను ఎదుర్కొనే బదులు అధికార బలంతో ప్రతిపక్షాన్ని లక్ష్యంగా చేసుకోవడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని ఆరోపించారు.ఈ ఆందోళనలో టీపీసీసీ కార్యదర్శి ఉదయ్ మోహన్ రెడ్డి, మాజీ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జనార్దన్ రెడ్డి, రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు గోపాల్ రెడ్డి, మొయినాబాద్ మాజీ జడ్పీటీసీ కాలే శ్రీకాంత్, శంకర్ పల్లి మున్సిపల్ చైర్మన్ సాత ప్రవీణ్ కుమార్, వైస్ చైర్పర్సన్ శ్వేతా పాండురంగారెడ్డి, ఏఎంసీ చైర్పర్సన్ గోవిందమ్మ గోపాల్ రెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ కాసెట్టి చంద్రమోహన్, సేవాదళ్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహిపాల్ యాదవ్, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బొల్లారం ప్రశాంత్ రెడ్డి, కౌన్సిలర్లు, సర్పంచులు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, కో–ఆప్షన్ సభ్యులు, మాజీ ప్రజా ప్రతినిధులు, ఎంఎస్‌యూఐ నాయకులు, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్ రెడ్డి సంతాప పర్యటన

- నేలకొండపల్లి మండలంలోని 7 గ్రామాల్లో బాధిత కుటుంబాలను పరామర్శ
- మృతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు



**ఖమ్మం రాజముద్ర న్యూస్:** నేలకొండపల్లి, ఇటీవల వివిధ కారణాలతో మరణించిన పలు కుటుంబాలను పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్ రెడ్డి గురువారం పరామర్శించారు.నేలకొండపల్లి మండలంలోని రాయిగూడెం, కట్టుకాచారం, కొంగర, బైరవునిపల్లి, తిరుమలాపురం, బోదులబండ గ్రామాల్లో పర్యటించిన ఆయన బాధిత కుటుంబాలను కలిసి ఓదార్చారు. మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్ రెడ్డి సందర్శించిన గ్రామాలు, కుటుంబాల వివరాలు:రాయిగూడెం బోయిన వెంకటరత్నం కుటుంబం కట్టుకాచారం దొడ్డ పిచ్చయ్య, కేతినేని రంగయ్య, ఏటుకురి వెంకటేశ్వరరావు కుటుంబాలు కొంగర అమ్మటి అప్పారావు, కొండ రాములమ్మ కుటుంబాలుబైరవునిపల్లి మరికంటి రాములు, సిలివేరు ఉప్పలయ్య కుటుంబాలుతిరుమలాపురం భూక్యా బిచ్చాలు కుటుంబం బోదులబండ ఆనంతు వీరయ్య కుటుంబం ప్రతి ఇంటికి వెళ్లిన కందాళ ఉపేందర్ రెడ్డి మృతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను కలిసి వారికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "కుటుంబంలో పెద్దను కోల్పోవడం చాలా బాధాకరం. ఈ కష్ట సమయంలో బీఆర్ఎస్ పార్టీ, నేను ఎప్పుడూ మీకు అండగా ఉంటాం. ప్రభుత్వం నుండి రావాల్సిన సహాయం అందేలా కృషి చేస్తాం" అని భరోసా ఇచ్చారు.ఈ పరామర్శ కార్యక్రమంలో స్థానిక బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు కందాళ ఉపేందర్ రెడ్డి వెంట ఉన్నారు.

## మరకత శివాలయంలో డైరెక్టర్ తరుణ్ భాస్కర్, హీరోయిన్ ఇషారబ్బ ప్రత్యేక పూజలు



**శంకర్ పల్లి, రాజముద్ర న్యూస్:** శంకర్ పల్లి మండల పరిధిలోని చందిప్ప గ్రామంలో వెలసిన 11వ శతాబ్దపు మహిమగల శ్రీ బ్రహ్మసూత్ర మరకత శివాలయంలో గురువారం టాలీవుడ్ డైరెక్టర్ తరుణ్ భాస్కర్, హీరోయిన్ ఇషారె బ్బ స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకం చేశారు. అనంతరం ఆలయ అర్చకులు వీరేశం, కమిటీ సభ్యుడు హనుమంతు వారిని స్వామివారి శేషవస్త్రంతో సత్కరించి, తీర్థప్రసాదాలు అందజేసి, స్వామివారి చిత్రపటాన్ని బహుకరించారు. డైరెక్టర్, హీరోయిన్ మాట్లాడుతూ... పురాతన ఆలయంలో పూజలు చేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఎంతో మహిమగల, ప్రసిద్ధి చెందిన బ్రహ్మసూత్ర మరకత శివాలయానికి రావడంతో తమ జన్మ ధన్యమైందని వారు పేర్కొన్నారు. ఇక్కడి వాతావరణం ఎంతో ప్రశాంతంగా ఉందని, మీ మరదలు శివాలయం పరిసరాలు తమకు ఎంతో సంతృప్తిని ఇచ్చాయన్నారు.

## "సజీవంగా దొరకను" - అదే ఆజాద్ స్ఫూర్తి

- స్వాతంత్ర్య సమరయోధుడు చంద్రశేఖర్ ఆజాద్ జయంతి వేడుకలు
- పైనంపల్లిలో బీజేపీ యువమోర్చా ఆధ్వర్యంలో నివాళులు
- దేశభక్తి, త్యాగం యువతకు ఆదర్శం - పాగర్తి సుధాకర్



**ఖమ్మం రాజముద్ర న్యూస్:** నేలకొండపల్లి"దుష్మన్ కి గోలియోం కా హమ్ సామ్నా కరేంగే, ఆజాద్ హీ రహే హై, ఆజాద్ హీ రహేంగే!"అంటూ బ్రిటిష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించిన మహోన్నత విప్లవ వీరుడు చంద్రశేఖర్ ఆజాద్ జయంతిని బీజేపీ యువమోర్చా నేలకొండపల్లి మండల కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.పైనంపల్లి గ్రామంలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చంద్రశేఖర్ ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో బీజేపీ నేలకొండపల్లి మండల అధ్యక్షుడు పాగర్తి సుధాకర్ మాట్లాడుతూ,"భారత స్వాతంత్ర్య సంగ్రామంలో తనదైన శైలిలో విప్లవాత్మక పోరాటం సాగించిన మహోన్నత వీరుడు చంద్రశేఖర్ ఆజాద్.ఈ రోజు ఆయన జయంతి సందర్భంగా ఆ అమరవీరుని జయంతి జరుపుకోవడం మన అదృష్టం" అని అన్నారు.గాంధీజీ నిరాకరణోద్యమాన్ని ఉపసంహరించుకున్న తర్వాత, ఆజాద్ విప్లవ మార్గాన్ని ఎంచుకున్నారని గుర్తు చేశారు. లాలా లజపతిరాయ్ మరణానికి కారణమైన బ్రిటిష్ అధికారి సాండర్స్ ను వధించడంలో భగత్ సింగ్, రాజ్‌గురులకు ఆజాద్ అండగా నిలిచారని తెలిపారు."సజీవంగా దొరకను" అని ఆజాద్ ఒక ప్రతిజ్ఞ చేశారని, "నేను ఎప్పటికీ బ్రిటిష్ వారికి సజీవంగా చిక్కను. స్వేచ్ఛగా బతికాను, స్వేచ్ఛగానే మరణిస్తాను" అని ఆయన అన్నారని చెప్పారు.ఈ కార్యక్రమంలో బీజేపీ మండల నాయకులు సూరెపల్లి జ్ఞానరత్నం, సయ్యద్ మోహినుద్దీన్, కొండా హర్షవర్ధన్, యువమోర్చా మండల ప్రధాన కార్యదర్శి జెల్లా సురేష్, కొదమగుండ్ల స్వామి దాస్, అనసూర్య తదితరులు పాల్గొన్నారు

## వర్షా ల కోసం మహిళల ప్రత్యేక పూజలు

- బిందెలు ఎత్తుకొని బొడ్రాయి, ముత్యాలమ్మకు జలాభిషేకం
- సకాలంలో వర్షా లు కురిసి పంటలు బాగా పండాలని మొక్కులు



**ఖమ్మం రాజముద్ర న్యూస్:** మండ్రాజ్‌పల్లి కొత్తూరు, వరుణుడు కరుణించి సకాలంలో వర్షాలు కురవాలని నేలకొండపల్లి మండలం మండ్రాజ్‌పల్లి కొత్తూరు గ్రామ మహిళలు వినూత్నంగా ప్రార్థనలు చేశారు.వర్షాలు లేకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన చెందిన గ్రామ మహిలలు బుధవారం తలలపై జల బిందెలు ఎత్తుకొని గ్రామంలో ప్రదర్శనగా వెళ్లారు. బొడ్రాయి, ముత్యాలమ్మకు జలాభిషేకం ప్రదర్శనగా వెళ్లిన మహిళలు గ్రామంలోని బొడ్రాయి, శ్రీ ముత్యాలమ్మ తల్లి ఆలయాల వద్దకు చేరుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. తలపై తెచ్చిన నీటితో దేవతలకు జలాభిషేకం చేసి, పూలతో అలంకరించారు. "అమ్మా ముత్యాలమ్మ తల్లి.. రైతులను ఆదుకో. వర్షాలు కురిపించి పంటలు పండేలా చూడు" అంటూ మహిళలు భక్తితో మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం గ్రామ శ్రేయస్సు కోసం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గత నెల రోజులుగా వర్షాలు లేకపోవడంతో విత్తిన విత్తనాలు మొలకెత్తడం లేదని, ఇప్పటికే మొలిచిన పైరులు ఎండిపోతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో మహిళలు చేపట్టిన ఈ కార్యక్రమం గ్రామంలో చర్చనీయాంశంగా మారింది ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన మహిళలు, రైతులు, పెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వర్షాలు కురిసే వరకు ప్రతి రోజు పూజలు చేస్తామని మహిళలు తెలిపారు.

# ఉరి వేసుకుని ఒకరు మృతి



**రామారెడ్డి, రాజముద్ర న్యూస్:** మృతుడు తాటికొండ గణేష్ తండ్రి నర్సారెడ్డి వయస్సు 37 సంవత్సరంలు వృత్తి డ్రైవర్ నివాసము ఉప్పల్వాయి గ్రామం తల్లి తాటికొండ బుచ్చవ్వ మృతుడి భార్య అపర్ణ లతో భూమి అమ్మి డబ్బులు ఇవ్వమని వారిని అడగగా మా వద్ద డబ్బులు లేవు అని తెలుపగా మృతుడు తల్లి, భార్యతో గొడవపడి ఉదయం 8 గంటల సమయంలో ఇంటికి లోపల గొల్లంపెట్టుకొని కట్టెదూలం కు లుంగితో ఉరి వేసుకుని చనిపోయినాడు , మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి హాస్పిటల్ కు తరలించారు,కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మురళి తెలిపారు.

# గిద్ద గ్రామం లో వైద్యశిబిరం నిర్వహణ



**రామారెడ్డి, రాజముద్ర, న్యూస్:** రామారెడ్డిమండలం గిద్ద గ్రామం లో వైద్య శిబిరం నిర్వహించడం జరిగింది ఈ శిబిరం లో 86 మందికి పరీక్షించి మందులు ఇవ్వడం జరిగింది ఈ కార్యక్రమం లో గ్రామ సర్పంచ్ మొగుళ్ళ సరిత శ్రీనివాస్ గౌడ్, సెక్రటరీ శ్రీకాంత్,డా, రమ్య శ్రీ, సూపర్ వైజర్ సంజు జర్జ్,వైద్య సిబ్బంది గ్రామస్తులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ఆధ్వర్యంలో శాంతియుత నిరసన



**రామారెడ్డి, రాజముద్ర న్యూస్:** ఏఐసీసీ, టీపీసీసీ కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షులు ఏలే మల్లికార్జున్ పిలుపు మేరకు, ప్రతిపక్ష నాయకులు, రాహుల్ గాంధీ అరెస్టులను ఖండిస్తూ, అలాగే నీట్ పేపర్ లీక్ వ్యవహారంపై కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ అన్నారం గ్రామం బస్సు స్టాండ్ లో మహాత్మా గాంధీ విగ్రహం దగ్గర కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో శాంతియుత నిరసన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాల్సిన కేంద్ర ప్రభుత్వం ప్రతిపక్ష నాయకులపై అక్రమ అరెస్టులకు పాల్పడడం ప్రజాస్వామ్య విలువలను దెబ్బతీసే చర్య అని మండిపడ్డారు. అలాగే, దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడిన నీట్ పేపర్ లీక్ వ్యవహారంపై నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే తన పదవికి ఎరాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్,నాయకులు, మద్దికుంట దయానంద్, రాగోత్తమ్ రెడ్డి,చింతకింది శ్రీనివాస్ ,మాజీ సొసైటీ చైర్మన్ స్వామి గౌడ్,మాజీ ఎంపీటీసీ గంగ రెడ్డి,గ్రామ కాంగ్రెస్ నాయకులు.పంగ రాజాం,దేవదాస్, కిసారి లక్ష్మణ్ ,కూడలి ఎల్లం,కూడలి స్వామి,పంగ లింగం, రవి నాయక్, బాబురావు,గణేష్, శంకర్ నాయక్, దమ్లా నాయక్,యువజన కాంగ్రెస్ నాయకులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రత్యేక ఓటర్ జాబితాలో ఎలాంటి ఫిర్యాదులకు తావు లేకుండా పనిచేయాలి

**వికారాబాద్ జిల్లా కలెక్టర్ దీపక్ తివారి**




**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :** రోజు వారి లక్ష్యాలను నిర్దేశించుకొని ఎస్ ఐ ఆర్ ప్రక్రియను వేగవంతం చేయాలనీ వికారాబాద్ జిల్లా కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. గురువారము వీడియో కాన్ఫరెన్సు హాలు నుండి అన్ని మండలాల తహసిల్దార్లు, ఎం పి డి ఓ లు, మున్సిపల్ కమిషనర్ లతో జూమ్ సమావేశము నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని ప్రతి రోజు ఐదు శాతం చొప్పున లక్ష్యాన్ని నిర్దేశించుకొని మూడు రోజులలో 90 శాతం పూర్తి చేయాలనీ అన్నారు. ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని ఆగష్టు 3 వ తేది వరకు ఎన్నికల కమిషన్ పోడిగించినందున, భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు పారదర్శకంగా, కచ్చితత్వంతో నిర్వహించాలని జిల్లా కలెక్టర్ మండల తహసీల్దార్లను ఆదేశించారు. ఓటరు జాబితాలో అర్హులైన ప్రతి ఒక్కరి పేరును నమోదు చేయడం, అనర్హుల పేర్లను నిబంధనల ప్రకారం తొలగించడం, మార్పులు, చేర్పులు, సవరణలను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని సూచించారు. బూత్ లెవల్ అధికారులతో సమన్వయం చేసుకుంటూ ఇంటింటి ధృవీకరణను సమర్థవంతంగా నిర్వహించాలని, ఓటర్ల నుంచి వచ్చే దరఖాస్తులను సకాలంలో పరిశీలించి నిబంధనల ప్రకారం పరిష్కరించాలని తెలిపారు. ఎలాంటి ఫిర్యాదులకు తావు లేకుండా పూర్తి పారదర్శకతతో విధులు నిర్వహించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా మండలం వారిగా పూర్తి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు అయ్యేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ జూమ్ సమావేశంలో ట్రిని కలెక్టర్ సచిన్ బస్వరాజ్ గుట్టూర్, జడ్ పి సి ఇ ఓ సుదీర్, డి ఆర్ ఓ స్వర్ణ లత , ఆర్ డి ఓ వాసుచంద్ర, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ నేమత్ హాలి, జిల్లా అధికారులు మండల తహసీల్దార్లు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# "ఆజాద్‌గా జీవించాడు... ఆజాద్‌గానే అమరుడయ్యాడు"

- విప్లవ జ్యోతి చంద్రశేఖర్ ఆజాద్
- జయంతి ప్రత్యేకం




**రామంతపూర్, జూలై 23,( రాజ ముద్ర న్యూస్ ):** "శత్రువు చేతికి సజీవంగా చిక్కను... చివరి బుల్లెట్ నాకోసమే." ఈ మాటలు కేవలం ఒక వ్యక్తి పలికిన మాటలు కావు. అవి భారత స్వాతంత్ర్య సమర చరిత్రలో శాశ్వతంగా నిలిచిపోయిన విప్లవ ప్రతిజ్ఞ. ఆ ప్రతిజ్ఞకు కట్టుబడి తన జీవితాన్ని దేశానికి అంకితం చేసిన అమరవీరుడు చంద్రశేఖర్ ఆజాద్. జూలై 23, 1906న మధ్యప్రదేశ్‌లోని భావ్రా గ్రామంలో జన్మించిన చంద్రశేఖర్ ఆజాద్ చిన్న వయసులోనే దేశభక్తి భావాలతో పెరిగారు. మహాత్మా గాంధీ పిలుపునిచ్చిన అసహకార ఉద్యమంలో పాల్గొన్న ఆయనను బ్రిటిష్ పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. అక్కడ న్యాయమూర్తి "నీ పేరు ఏమిటి?" అని అడగగా, ఆయన ధైర్యంగా "ఆజాద్", "తండ్రి పేరు?" అంటే "స్వాతంత్ర్యం", "చిరునామా?" అంటే "జైలు" అని సమాధానం ఇచ్చారు. అప్పటి నుంచి ఆయన పేరు చంద్రశేఖర్ ఆజాద్గా చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయింది.

**విప్లవమే మార్గమని నమ్మిన యోధుడు**

దేశానికి స్వాతంత్ర్యం సాధించాలంటే కేవలం ప్రార్థనలు, వినతులు సరిపోవని, అవసరమైతే విప్లవ పోరాటం కూడా అవసరమేనని ఆజాద్ విశ్వసించారు. ఈ ఆలోచనతో ఆయన హిందుస్థాన్ సోషలిస్ట్ రిపబ్లికన్ అసోసియేషన్ లో చేరి యువ విప్లవకారులను ఒకే తాటిపైకి తీసుకొచ్చారు.భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ వంటి మహా విప్లవకారులకు ఆయన మార్గదర్శకుడిగా నిలిచారు. బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా అనేక రహస్య కార్యకలాపాలకు నాయకత్వం వహించారు.

**బ్రిటిష్ ప్రభుత్వం ఆయనను అత్యంత ప్రమాదకర విప్లవకారుడిగా ప్రకటించింది.**

బ్రిటిష్ సామ్రాజ్యాన్ని వణికించిన ధైర్యం చంద్రశేఖర్ ఆజాద్ జీవితమంతా పోలీసులను తప్పించుకుంటూ, దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడుతూ గడిచింది. ఆయనను పట్టుకోవడానికి బ్రిటిష్ ప్రభుత్వం భారీ బహుమతిని కూడా ప్రకటించింది. అయినప్పటికీ ఆయనను సజీవంగా పట్టుకోవడంలో వారు ఎన్నడూ విజయవంతం కాలేకపోయారు. 1931 ఫిబ్రవరి 27న అలహాబాద్‌లోని ఆల్ఫ్రెడ్ పార్కులో బ్రిటిష్ పోలీసులు ఆయనను చుట్టుముట్టారు. చివరి వరకు వీరోచితంగా పోరాడిన ఆజాద్, తన వద్ద మిగిలిన చివరి బుల్లెట్‌ను శత్రువుకు కాదు, తనకే వినియోగించారు. "బ్రిటిష్ చేతికి సజీవంగా చిక్కను" అనే తన ప్రతిజ్ఞను నిలబెట్టుకుంటూ అమరుడయ్యారు.

**నేటి యువతకు ఆజాద్ ఇచ్చిన సందేశం**

నేడు దేశానికి విదేశీ పాలకుల నుంచి స్వాతంత్ర్యం అవసరం లేదు. కానీ అవినీతి, మాదకద్రవ్యాలు, సామాజిక అసమానతలు, నిర్లక్ష్యం, బాధ్యతారాహిత్యం వంటి సవాళ్ల నుంచి విముక్తి అవసరం ఉంది. ఆజాద్ జీవితం మనకు ధైర్యం, క్రమశిక్షణ, త్యాగం, దేశభక్తి, నాయకత్వం అనే విలువలను నేర్పుతుంది.

దేశం కోసం జీవించడం అంటే కేవలం యుద్ధం చేయడం కాదు; నిజాయితీగా పనిచేయడం, చట్టాన్ని గౌరవించడం, సమాజానికి ఉపయోగపడే పౌరులుగా ఎదగడం కూడా దేశసేవే.

**చరిత్ర మరువని మహావీరుడు**

చంద్రశేఖర్ ఆజాద్ జీవితం చిన్నదే అయినా, ఆయన ప్రభావం శాశ్వతం. భారత స్వాతంత్ర్య పోరాటంలో ఆయన చూపిన త్యాగం, ధైర్యం తరతరాలకు స్ఫూర్తిగా నిలుస్తూనే ఉంటుంది. ఆయన పేరు వినగానే దేశభక్తి ఉప్పొంగుతుంది. ఆయన అడుగుజాడల్లో నడిచిన వేలాది మంది యువకులు స్వాతంత్ర్య ఉద్యమానికి తమ ప్రాణాలను అర్పించారు.

ముగింపు దేశం కోసం జీవించడం, దేశం కోసం త్యాగం చేయడం అంటే ఏమిటో తన జీవితంతో నిరూపించిన మహానుభావుడు చంద్రశేఖర్ ఆజాద్. "ఆజాద్‌గా పుట్టకపోయినా... ఆజాద్‌గా జీవించాడు. ఆజాద్‌గా జీవించడమే కాదు... ఆజాద్‌గానే అమరుడయ్యాడు." చంద్రశేఖర్ ఆజాద్ జయంతి సందర్భంగా ఆ మహావీరునికి ఘన నివాళులు అర్పిద్దాం. ఆయన ఆశయాలను, దేశభక్తిని, త్యాగస్ఫూర్తిని నేటి తరానికి అందించడం మనందరి బాధ్యత.

# సైబర్ నేరాల నియంత్రణలో ప్రతి అధికారి బాధ్యతాయుతంగా పనిచేయాలి

**వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా**




**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :** తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ ) ఆధ్వర్యంలో సైబర్ నేరాల నియంత్రణ, దర్యాప్తు పురోగతి, సాంకేతిక పరిజ్ఞానం వినియోగంపై నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, జిల్లా అదనపు ఎస్పీ రాజేశ్ మీనా జిల్లా సైబర్ క్రైమ్, సోషల్ మీడియా, ఐటీ సెల్ అధికారులతో కలిసి పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా జిల్లా అధికారులతో మాట్లాడుతూ జిల్లాలో సైబర్ నేరాల నియంత్రణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. ప్రతి పోలీస్ స్టేషన్‌లో సైబర్ క్రైమ్ వ్యవహారాలను ప్రత్యేకంగా పర్యవేక్షిస్తూ అందిన ప్రతి ఫిర్యాదుపై వెంటనే స్పందించి బాధితులకు సత్వర సహాయం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.సైబర్ నేరాల దర్యాప్తులో సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించాలని, ఈ –జీరో ఎఫ్ ఐ ఆర్ విధానాన్ని సమర్థంగా అమలు చేయడంతో పాటు ప్రతి పోలీస్ స్టేషన్‌లో సైబర్ క్రైమ్ వెర్టికల్ పనితీరును బలోపేతం చేయాలని తెలిపారు. సైబర్ క్రైమ్ కేపీఎల్స్ ను నిరంతరం పర్యవేక్షిస్తూ సైబర్ సపోర్ట్ బూరెవు (సి ఎస్ బి) ద్వారా లభించే దర్యాప్తు సహాయాన్ని పూర్తి స్థాయిలో వినియోగించాలని సూచించారు. ఇతర ఆన్‌లైన్ పోర్టల్స్‌లో కేసుల వివరాలను ఎప్పటికప్పుడు నవీకరించాలని, నెలవారీ సమీక్షల ద్వారా పెండింగ్ కేసుల పురోగతిని పరిశీలించాలని, రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించే ప్రత్యేక సైబర్ ఆపరేషన్లలో సమన్వయంతో పాల్గొనాలని ఆదేశించారు. సైబర్ నేరాల దర్యాప్తు నైపుణ్యాలను మెరుగుపర్చేందుకు పోలీసు అధికారులు, సిబ్బందికి నిరంతర శిక్షణ నిర్వహించాలని పేర్కొన్నారు. మ్యూల్ బ్యాంక్ ఖాతాలు అనుమానాస్పద బ్యాంకింగ్ లావాదేవీలు, ఆన్‌లైన్ మోసాలకు సంబంధించిన ఆర్థిక లావాదేవీలపై ప్రత్యేక నిఘా ఉంచి, నిందితులను వేగంగా గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి నెల మొదటి బుధవారం నిర్వహించే సైబర్ జాగ్రూక్త దివస్ కార్యక్రమాన్ని జిల్లాలో విస్తృతంగా నిర్వహించాలని ఎస్పీ ఆదేశించారు. సైబర్ వారియర్స్ , వీపీఓ లు, విద్యాసంస్థల సహకారంతో ప్రజలకు సైబర్ భద్రతపై అవగాహన కల్పించాలని సూచించారు. ప్రజలు ఓటీపీ , సి వి వి, యూపీఐ పిన్ , బ్యాంకు వివరాలు ఎవరికీ తెలియజేయవద్దని, అనుమానాస్పద లింకులు, క్యూ ఆర్ కోడ్‌లు, పెట్టుబడి మోసాలు, డిజిటల్ అరెస్ట్, పార్ట్‌టైమ్ ఉద్యోగాల పేరుతో జరిగే మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 హెల్ప్‌లైన్ లేదా నేషనల్ సైబర్ క్రైమ్ పోర్టల్ లో ఫిర్యాదు చేయాలని సూచించారు.

# ఆరుతడి పంటల సాగుపై రైతులు దృష్టి సారించాలి

- ఎల్‌నినో ప్రభావంతో వరి, మొక్కజొన్న, మిరప వద్దు - కట్టుకాసారం క్లస్టర్ అధికారి బి. శిరీష సూచన
- కందులు, పెసర్లు, మినుములు, జొన్నలు, సజ్జలు సాగు చేయాలని పిలుపు



**ఖమ్మం రాజముద్ర న్యూస్:** నేలకొండపల్లి, ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తక్కువగా నమోదవుతున్న నేపథ్యంలో రైతులు అధిక నీటి అవసరమయ్యే పంటలకు బదులు ఆరుతడి పంటల సాగు వైపు అడుగులు వేయాలని కట్టుకాసారం క్లస్టర్ అధికారి బి. శిరీష సూచించారు.నేలకొండపల్లి మండలంలోని కట్టుకాసారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో గురువారం సర్పంచ్ సైదయ్య అధ్యక్షతన "వర్షాభావ పరిస్థితులు – ప్రత్యామ్నాయ పంటలు" అనే అంశంపై గ్రామ స్థాయి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో క్లస్టర్ అధికారి బి. శిరీష పాల్గొని రైతులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రస్తుతం వర్షాలు ఆలస్యంఅవుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో వరి, మొక్కజొన్న, మిరప వంటి అధిక నీరు కావాల్సిన పంటలు సాగు చేస్తే రైతులు తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉంది" అని అన్నారు.

ప్రభుత్వం కూడా నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకొని సాగు విధానాన్ని మార్చుకోవాలని సూచిస్తోంది. కాబట్టి రైతులు అందరూ అవగాహనతో నిర్ణయం తీసుకోవాలి" అని తెలిపారు. వర్షాభావ పరిస్థితులను అధిగమించేందుకు రైతులు కందులు, పెసర్లు, మినుములు, జొన్నలు, సజ్జలు వంటి ఆరుతడి పంటలను సాగు చేయడం మంచిదని సూచించారు. "ఈ పంటలకు నీటి అవసరం తక్కువ. చీడపీడల బెడద కూడా తక్కువగా ఉంటుంది. అంతే కాకుండా మార్కెట్లో మంచి ధర కూడా లభిస్తుంది. ఎల్‌నినో ప్రభావాన్ని సమర్థంగా ఎదుర్కోవడానికి ఇదే సరైన మార్గం"అనివివరించారు.వ్యవసాయ శాఖ ద్వారా అందిస్తున్న సబ్సిడీలు, విత్తనాలు, సాంకేతిక సహాయం గురించి కూడా రైతులకు అవగాహన కల్పించారు.గ్రామ స్థాయి అధికారులు ప్రతి గ్రామంలో రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, వరి సాగు వల్ల వచ్చే నష్టాలను వివరించాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సైదయ్య, ఉప సర్పంచ్, పంచాయతీ సభ్యులు, వ్యవసాయ శాఖ అధికారులు, క్షేత్ర సహాయకులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# జింబాబ్వేలో గెలుపే లక్ష్యం..

## నేడు భారత్ తొలి టీ20




**హరారే, జూలై 23 (ఉద్యమ కెరటం):** ఐర్లాండ్, ఇంగ్లాండ్ పర్యటనల్లో ఆశించిన ఫలితాలు రాకపోవడంతో నిరాశలో ఉన్న భారత జట్టు జింబాబ్వే పర్యటనతో కొత్త ఆరంభానికి సిద్ధమైంది. మూడు మ్యాచ్‌ల టీ20 అంతర్జాతీయ సిరీస్‌లో భాగంగా నేడు హరారేలో జరిగే తొలి మ్యాచ్‌లో విజయం సాధించి మళ్లీ గెలుపు బాట పట్టాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇంగ్లాండ్ పర్యటన ముగిసిన కొద్ది రోజుల వ్యవధిలోనే మరో అంతర్జాతీయ సిరీస్ ఆడుతున్న భారత జట్టుకు ఇది కీలక పరీక్షగా మారింది. యువ ఆటగాళ్లతో కూడిన జట్టుకు శ్రేయస్ అయ్యర్ నాయకత్వం వహిస్తుండగా, గత సిరీస్‌లో జరిగిన తప్పిదాలను సరిదిద్దుకుని మెరుగైన ప్రదర్శన చేయాలని జట్టు యాజమాన్యం భావిస్తోంది. ఇంగ్లాండ్ పర్యటనలో పాల్గొన్న కెప్టెన్ శ్రేయస్ అయ్యర్‌తో పాటు పలువురు ఆటగాళ్లు నేరుగా హరారే చేరుకోగా, మిగతా సభ్యులు తాత్కాలిక ప్రధాన కోచ్ వీవీఎస్ లక్ష్మణ్ పర్యవేక్షణలో భారత్ నుంచి జింబాబ్వేకు బయలుదేరారు. మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో తొలి మ్యాచ్ నేడు సాయంత్రం 4.30 గంటలకు, రెండో మ్యాచ్ జులై 25న, మూడో మ్యాచ్ జులై 26న అదే సమయానికి జరగనున్నాయి. ఈ మూడు మ్యాచ్‌లకూ హరారే స్పోర్ట్స్ క్లబ్ ఆతిథ్యం ఇస్తోంది. ఈ సిరీస్‌కు సంబంధించి అభిమానులకు ముఖ్యమైన విషయం ఏమిటంటే, సాధారణ క్రీడా ప్రసార ఛానళ్లలో మ్యాచ్‌లు ప్రత్యక్ష ప్రసారం కావు. ఈ మ్యాచ్‌లను ఫ్యాన్‌కోడ్ వేదికలో మాత్రమే ప్రత్యక్ష ప్రసారంగా వీక్షించవచ్చు. ఇందుకోసం మ్యాచ్ పాస్ లేదా చందా తీసుకోవాల్సి ఉంటుంది. టెలివిజన్‌లో మాత్రం యునైటెడ్-8 స్పోర్ట్స్ ఛానల్‌తో పాటు దూరదర్శన్ స్పోర్ట్స్ ప్రత్యక్ష ప్రసారం అందుబాటులో ఉంటుంది. వరుస పరాజయాల తర్వాత ఈ సిరీస్‌లో విజయం సాధించి ఆత్మవిశ్వాసాన్ని తిరిగి పొందాలని భారత జట్టు భావిస్తోంది. మరోవైపు యువ ఆటగాళ్లు తమ ప్రతిభను ఎలా చాటుకుంటారన్న అంశంపై క్రికెట్ అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. భారత్ జట్టు: శ్రేయస్ అయ్యర్ (కెప్టెన్), తిలక్ వర్మ (వైస్ కెప్టెన్), వైభవ్ సూర్యవంశీ, అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్, శివమ్ దూబే, సూర్యాంశ్ షెడ్గే, రింకూ సింగ్, హర్ష్ దూబే, వరుణ్ చక్రవర్తి, ప్రిన్స్ యాదవ్, యశ్ ఠాకూర్, అర్ష్‌దీప్ సింగ్, మయాంక్ యాదవ్, ప్రభ్‌సిమ్రాన్ సింగ్.




## చైనా ఓపెన్‌లో ముగిసిన
# సింధు పోరాటం

**చాంగ్‌జౌ, జూలై 23 (ఉద్యమ కెరటం):** చైనా ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీలో భారత స్టార్ షట్లర్ పీవీ సింధు ప్రీక్వార్టర్ ఫైనల్లోనే నిష్క్రమించింది. గురువారం జరిగిన ఉత్కంఠభరిత పోరులో ప్రపంచ నాలుగో ర్యాంకర్ చెన్ యుఫేయీ చేతిలో సింధు 16-21, 22-20, 21-18 తేడాతో ఓటమి పాలైంది. గంటా 29 నిమిషాల పాటు సాగిన ఈ మ్యాచ్‌లో చివరి వరకు ఇరువురు షట్లర్లు హోరాహోరీగా పోటీపడ్డారు.

ఇటీవల జపాన్ ఓపెన్ టైటిల్‌ను కైవసం చేసుకుని మంచి జోష్‌లో ఉన్న సింధు తొలి గేమ్‌లో అద్భుత ప్రదర్శనతో ఆధిక్యం సాధించింది. రెండో గేమ్‌లో కూడా విజయం అంచుల వరకు వెళ్లిన ఆమెకు వచ్చిన నాలుగు మ్యాచ్ పాయింట్లను సద్వినియోగం చేసుకోలేకపోయింది. ఆ అవకాశాన్ని వినియోగించుకున్న చెన్ యుఫేయీ రెండో గేమ్‌ను గెలిచి మ్యాచ్‌ను నిర్ణయాత్మక మూడో గేమ్‌కు తీసుకెళ్లింది. మూడో గేమ్‌లో కూడా ఇరువురు షట్లర్లు నువ్వా-నేనా అన్నట్లు పోరాడారు. అయితే చివరి దశలో కీలక పాయింట్లు సాధించిన చెన్ యుఫేయీ మ్యాచ్‌పై పూర్తి ఆధిపత్యం చెలాయించి విజయాన్ని సొంతం చేసుకుంది. దీంతో గతవారం జపాన్ ఓపెన్ సెమీఫైనల్లో ఎదురైన ఓటమికి ఆమె ప్రతీకారం తీర్చుకున్నట్లైంది. ఈ ఓటమితో చైనా ఓపెన్‌లో పీవీ సింధు ప్రస్థానం ముగిసింది. అయినప్పటికీ మ్యాచ్ మొత్తం అత్యున్నత స్థాయి ర్యాలీలు, ఉత్కంఠభరిత పోరుతో సాగి బ్యాడ్మింటన్ అభిమానులను అలరించింది.

# లవ్లీనాకు పతకం ఖాయం

## భారత్‌కు తొలి విజయం



**గ్లాస్‌గోవ్, జులై 23 :** కామన్‌వెల్త్ క్రీడల్లో భారత్‌కు తొలి పతకం దాదాపు ఖాయమైంది. మహిళల 75 కిలోల బాక్సింగ్ విభాగంలో భారత స్టార్ బాక్సర్ లవ్లీనా బోర్గోహెయిన్ సెమీఫైనల్‌కు చేరడంతో కనీసం కాంస్య పతకం ఆమె ఖాతాలో పడనుంది. క్వార్టర్ ఫైనల్లో ప్రత్యర్థి లేకపోవడంతో లవ్లీనాకు బై లభించింది. దీంతో ఆమె నేరుగా సెమీఫైనల్‌కు అర్హత సాధించింది. జులై 31న జరిగే సెమీఫైనల్‌లో తాఫకితో లవ్లీనా తలపడనుంది. ఒకవేళ ఆ పోరులో ఓడినా కూడా బాక్సింగ్ నిబంధనల ప్రకారం ఆమెకు కాంస్య పతకం ఖాయం కానుంది. కామన్‌వెల్త్ క్రీడల ప్రారంభ వేడుకలు జరగకముందే భారత్‌కు పతకం ఖరారు కావడం విశేషం. రింగ్‌లో తొలి పోరు ఆడకముందే లవ్లీనా పోడియంపై చోటు దక్కించుకోవడం భారత బాక్సింగ్‌కు మరో గర్వకారణంగా నిలిచింది. ఈసారి కామన్‌వెల్త్ క్రీడల్లో భారత్ తరఫున మొత్తం 124 మంది అథ్లెట్లు వివిధ విభాగాల్లో పోటీ పడుతున్నారు. 2022 కామన్‌వెల్త్ క్రీడల్లో భారత్ అత్యుత్తమ ప్రదర్శన కనబర్చిన నేపథ్యంలో, ఈసారి కూడా మరిన్ని పతకాలు సాధించాలని భారత జట్టు లక్ష్యంగా పెట్టుకుంది.








## డోప్ పరీక్షలో
# అరుణ్ కుమార్‌కు షాక్

**గ్లాస్‌గోవ్, జులై 23 :** కామన్‌వెల్త్ క్రీడలు ప్రారంభానికి ముందే భారత జట్టుకు ఎదురుదెబ్బ తగిలింది. జూడో క్రీడాకారుడు అరుణ్ కుమార్ డోప్ పరీక్షలో విఫలమైన నేపథ్యంలో అతడిని కామన్‌వెల్త్ క్రీడల నుంచి అనర్హుడిగా ప్రకటించారు. పురుషుల 73 కిలోల జూడో విభాగంలో భారత్‌కు ప్రాతినిధ్యం వహించాల్సిన అరుణ్ కుమార్ నమూనాలో నిషేధిత ఉత్ప్రేరక పదార్థాల ఆనవాళ్లు గుర్తించినట్లు అధికారులు వెల్లడించారు. ఈ మేరకు జాతీయ డోపింగ్ నిరోధక సంస్థ బుధవారం అతడికి నోటీసులు జారీ చేసింది. అంతర్జాతీయ జూడో సమాఖ్య అరుణ్ కుమార్ నమూనాలో ప్రతికూల విశ్లేషణ ఫలితం నమోదైనట్లు కామన్‌వెల్త్ క్రీడల నిర్వాహకులతో పాటు భారత ఒలింపిక్ సంఘానికి సమాచారం అందించింది. అనంతరం 2026 కామన్‌వెల్త్ క్రీడల అధికారిక క్రీడాకారుల జాబితా నుంచి అతడి పేరును తొలగించారు. అరుణ్ కుమార్ స్థానంలో మరో జూడో క్రీడాకారుడిని ఎంపిక చేసే అవకాశం లేదని భారత జూడో సమాఖ్య అధ్యక్షుడు ముకేశ్ కుమార్ స్పష్టం చేశారు. దీంతో పురుషుల 73 కిలోల విభాగంలో భారత్‌కు ఒక అవకాశం కోల్పోయినట్లైంది.

# గుకేశ్‌కు మరో షాక్..

## ప్రణేష్ సంచలన విజయం

**చెన్నై, జులై 23 :** చెన్నై గ్రాండ్ మాస్టర్స్ చెస్ టోర్నీలో యువ గ్రాండ్‌మాస్టర్ ఎం. ప్రణేష్ సంచలన విజయం నమోదు చేశాడు. ప్రపంచ ఛాంపియన్ డి. గుకేశ్‌పై 39 ఎత్తుల్లో గెలిచి తన కెరీర్‌లోనే అతిపెద్ద విజయాన్ని అందుకున్నాడు. మరోవైపు గుకేశ్ ఈ టోర్నీలో వరుసగా రెండో ఓటమిని చవిచూడాల్సి వచ్చింది. అంతకుముందు అర్జున్ ఎరిగైసి చేతిలో ఓటమిపాలైన గుకేశ్, ప్రణేష్‌తో జరిగిన మ్యాచ్‌లోనూ అనుకూల స్థితిని విజయంగా మలచుకోలేకపోయాడు. కారో-కాన్ డిఫెన్స్‌లో తెల్ల పావులతో ఆడిన ప్రణేష్ ప్రారంభంలో ఒత్తిడిని ఎదుర్కొన్నప్పటికీ, లాంగ్ కాస్లింగ్‌తో ఆటను సంక్లిష్టంగా మార్చి ప్రత్యర్థిపై ఒత్తిడి పెంచాడు. ఒక దశలో గుకేశ్ బలమైన ఎత్తుగడలతో ఆధిపత్యం ప్రదర్శించినప్పటికీ, డీ3 వద్ద లభించిన కీలక అవకాశాన్ని సద్వినియోగం చేసుకోలేకపోయాడు. అనంతరం రూక్‌ను బీ5కు కదిపిన ప్రణేష్ క్రమంగా ఆటపై పట్టు సాధించి గుకేశ్‌ను రక్షణాత్మక స్థితిలోకి నెట్టాడు. చివరికి ప్రణేష్ తన ఆధిక్యాన్ని నిలబెట్టుకుంటూ 39వ ఎత్తులో విజయాన్ని ఖాయం చేశాడు. ఈ విజయంతో చెన్నై గ్రాండ్ మాస్టర్స్ టోర్నీలో అతను సంచలనం సృష్టించగా, వరుస పరాజయాలతో గుకేశ్ టైటిల్ అవకాశాలను క్లిష్టం చేసుకున్నాడు.

# కామన్వెల్త్‌లో 9 క్రీడలకు కోత

## భారత్‌కు భారీ ఎదురుదెబ్బ




**గ్లాస్‌గోవ్, జులై 23 :** 2026 కామన్వెల్త్ క్రీడల నిర్వహణలో కీలక మార్పులు చోటుచేసుకున్నాయి. క్రికెట్, హాకీ, బ్యాడ్మింటన్, రెజ్లింగ్ సహా మొత్తం తొమ్మిది క్రీడలను ఈసారి పోటీల నుంచి తొలగించారు. తక్కువ బడ్జెట్‌తో పోటీలను నిర్వహించాలనే ఉద్దేశంతో నిర్వాహకులు ఈ నిర్ణయం తీసుకున్నారు. వాస్తవానికి 2026 కామన్వెల్త్ క్రీడలకు ఆస్ట్రేలియాలోని విక్టోరియా రాష్ట్రం ఆతిథ్యం ఇవ్వాల్సి ఉంది. అయితే పెరిగిన వ్యయభారం కారణంగా ఆ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహణ నుంచి తప్పుకోవడంతో స్కాట్లాండ్‌లోని గ్లాస్‌గోవ్ నగరం ఆతిథ్య బాధ్యతలు స్వీకరించింది. పరిమిత సమయం, తక్కువ నిధుల నేపథ్యంలో పోటీల సంఖ్యను గతంలో ఉన్న 19 క్రీడల నుంచి 10 క్రీడలకు కుదించారు. ప్రత్యేక వేదికలు, క్రీడాకారుల గ్రామాల నిర్వహణ ఖర్చులను తగ్గించడమే ఈ నిర్ణయానికి ప్రధాన కారణంగా నిర్వాహకులు తెలిపారు. కామన్వెల్త్ క్రీడల చరిత్రలో 1998లో మలేషియాలో జరిగిన పోటీల్లో పురుషుల క్రికెట్‌ను తొలిసారిగా ప్రవేశపెట్టారు. అనంతరం 24 ఏళ్ల విరామం తర్వాత 2022 బర్మింగ్‌హామ్ క్రీడల్లో మహిళల టీ20 క్రికెట్‌ను తిరిగి చేర్చారు. ఆ పోటీల్లో భారత మహిళల జట్టు రజత పతకాన్ని సొంతం చేసుకుంది. క్రికెట్‌తో పాటు హాకీ, బ్యాడ్మింటన్, రెజ్లింగ్ వంటి క్రీడల్లో భారత్‌కు పతకాల అవకాశాలు ఎక్కువగా ఉండేవి. ఇప్పుడు ఈ క్రీడలన్నీ తొలగించడంతో 2026 కామన్వెల్త్ క్రీడల్లో భారత పతకాల సంఖ్యపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని క్రీడా విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

## ఫైనల్ ఓటమి తర్వాత
# అర్జెంటీనాపై విమర్శలు

**మాడ్రిడ్, జులై 23 :** ఫిఫా ప్రపంచకప్-2026 ఫైనల్‌లో స్పెయిన్ చేతిలో అర్జెంటీనా ఓటమి పాలైనట్లు ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో ఆ జట్టుపై సామాజిక మాధ్యమాల్లో తీవ్ర చర్చ సాగుతోంది. టోర్నీ మొత్తం అర్జెంటీనా ఆటతీరు, ఆటగాళ్ల ప్రవర్తనపై పలువురు విమర్శలు వ్యక్తం చేస్తున్నారు. టోర్నీ జరుగుతున్న సమయంలోనే ఫిఫా అర్జెంటీనాకు అనుకూలంగా వ్యవహరిస్తోందంటూ కొందరు అభిమానులు ఆరోపణలు చేశారు. ఈ నేపథ్యంలో అర్జెంటీనాను ప్రపంచకప్ నుంచి తప్పించాలంటూ సామాజిక మాధ్యమాల్లో ఒక ఆన్‌లైన్ పిటిషన్ ప్రచారంలోకి వచ్చింది. దీనికి ప్రపంచవ్యాప్తంగా పెద్దఎత్తున మద్దతు లభించినట్లు పలు కథనాలు పేర్కొన్నాయి. ఫైనల్ అనంతరం అర్జెంటీనా ఆటగాళ్ల ప్రవర్తన కూడా వివాదాస్పదంగా మారినట్లు ప్రచారం జరిగింది. ప్రత్యర్థి ఆటగాళ్లతో వాగ్వాదాలు, ఘర్షణలకు సంబంధించిన ఘటనలు అభిమానులు, క్రీడా విశ్లేషకుల మధ్య చర్చనీయాంశంగా మారాయి. దీంతో టోర్నీ మొత్తం అర్జెంటీనా జట్టు ప్రవర్తనపై విమర్శలు మరింత పెరిగాయి. అయితే, అర్జెంటీనాపై వచ్చిన ఆరోపణలు, పిటిషన్‌లో పేర్కొన్న అంశాలపై ఫిఫా నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. అలాగే జట్టుపై ఎలాంటి క్రమశిక్షణా చర్యలు ప్రకటించలేదు. సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్న పలు గణాంకాలు, పిటిషన్‌కు సంబంధించిన వివరాలకు స్వతంత్ర ధృవీకరణ కూడా అందుబాటులో లేదు.



# ఆ పాత్రలకు దూరమే: కాజల్

టాలీవుడ్ స్టార్ హీరోయిన్ కాజల్ అగర్వాల్ మరోసారి తన వ్యక్తిగత అభిప్రాయాలను వెల్లడించారు. సినిమాల్లో బికినీ, బోల్డ్ సన్నివేశాలు, రొమాంటిక్ పాత్రలపై జరుగుతున్న చర్చల మధ్య ఆమె చేసిన వ్యాఖ్యలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. పెళ్లి తర్వాత కూడా గ్లామర్ పాత్రలు చేయడంపై వస్తున్న విమర్శల నేపథ్యంలో కాజల్ స్పందించిన తీరు సినీ వర్గాల్లో చర్చనీయాంశమైంది. ప్రస్తుతం 'ది ఇండియా స్టోరీ' చిత్రం ప్రచార కార్యక్రమాల్లో పాల్గొంటున్న కాజల్ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. సినీ ప్రయాణం ప్రారంభం నుంచే తాను బికినీ లేదా అతిగా బోల్డ్ సన్నివేశాల్లో నటించడానికి ఆసక్తి చూపలేదని తెలిపారు. అలాంటి పాత్రలు చేయడం తనకు వ్యక్తిగతంగా అసౌకర్యంగా అనిపిస్తుందని, అందుకే కొన్ని పెద్ద అవకాశాలను కూడా వదులుకున్నానని చెప్పారు. సినిమాల కోసం లేదా డబ్బు కోసం తన వ్యక్తిత్వాన్ని మార్చుకోలేనని, తనకు కొన్ని విలువలు, సిద్ధాంతాలు ఉన్నాయని వాటితో ఎప్పుడూ రాజీ పడనని కాజల్ స్పష్టం చేశారు. తెరపై బోల్డ్ సన్నివేశాల్లో నటించాల్సిన అవసరం ఉందని తాను భావించనని పేర్కొన్నారు.

తల్లి అయిన తర్వాత తన ఆలోచనల్లో మరింత మార్పు వచ్చిందని ఆమె తెలిపారు. తన కుమారుడు నీల్ కిచ్లూ పెద్దయ్యాక తన సినిమాలు చూసి గర్వపడాలని కోరుకుంటానని, అతనికి అసౌకర్యంగా అనిపించే పాత్రల్లో నటించకూడదనే ఉద్దేశంతో ఇప్పుడు ప్రతి కథను ఎంతో ఆలోచించి ఎంపిక చేసుకుంటున్నానని చెప్పారు. ఇటీవల యశ్ నటిస్తున్న 'టాక్సిక్' చిత్రంలోని రొమాంటిక్ సన్నివేశాలపై సామాజిక మాధ్యమాల్లో చర్చ జరిగిన నేపథ్యంలో కాజల్ గతంలో చేసిన వ్యాఖ్యలు మళ్లీ ప్రాధాన్యం సంతరించుకున్నాయి. పెళ్లి తర్వాత హీరోయిన్లు గ్లామర్ పాత్రలు చేయడంపై జరుగుతున్న చర్చల మధ్య తన వ్యక్తిగత విలువలను మరోసారి స్పష్టం చేయడంతో నెటిజన్లు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు.

ఇదిలా ఉండగా, కాజల్ ప్రధాన పాత్రలో నటించిన 'ది ఇండి యా స్టోరీ' చిత్రం జులై 24న ప్రేక్షకుల ముందుకు రానుంది. అలాగే నంద మూరి బాలకృష్ణ హీరోగా గోపీచంద్ మలినేని దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'ఎన్‌బీకే 111' చిత్రంలో కథానాయికగా నటిస్తూ మరోసారి తెలుగు ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతున్నారు.



# వెండితెరకు సెలవు

తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ చివరి సినిమాగా ఆయనే స్వయంగా చెప్పుకుంటూ వచ్చిన జన నాయకుడు అష్టకష్టాలు దాటుకుని ఎట్టకేలకు థియేటర్లలో అడుగు పెట్టేసింది. కర్ణాటకలో ఉదయం ఆరు గంటలకే షోలు పడిపోగా తెలుగు రాష్ట్రాల్లో ఎనిమిది గంటలకు తమిళనాడులో తొమ్మిది గంటలకు ప్రారంభమయ్యాయి. విజయ్ స్వంత రాష్ట్రంలో బ్లాక్ టికెట్లు విచ్చలవిడిగా అమ్మినట్టు కొన్ని వీడియోలు సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టడాన్ని టీవీకే పార్టీ సీరియస్ గా తీసుకుని విచారణ చేస్తోంది. ఆరు నెలలకు పైగా సెన్సార్ వివాదం వల్ల ల్యాబ్ లోనే మగ్గిన జన నాయకుడు మీద తమిళనాడులో క్రేజ్ ఏ మాత్రం తగ్గలేదని బుకింగ్స్ స్పష్టం చేస్తున్నాయి. చెన్నైలో ఉన్న మాయాజాల్ పదహారు స్క్రీన్ల మల్టీప్లెక్సులో రోజు మొత్తం కలిపి ఒక్క టికెట్ అందుబాటులో లేదంటే క్రేజ్ ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. అక్కడే కాదు కోయంబత్తూర్, పెరంబూరు లాంటి పట్టణాలు నగరాలు ఎక్కడ చూసినా ఇదే పరిస్థితి కనిపిస్తోంది. వీకెండ్ దాకా పెద్దగా మార్పు ఉండకపోవచ్చు.

ఒకవేళ విజయ్ అధికారంలో రాకపోయి ఉంటే ఎలా ఉండేదో కానీ తలపతిని సిఎంగా చూసుకుంటూ ఇప్పుఈ సినిమాను సెలబ్రేట్ చేసుకోవడం ఫ్యాన్స్ ఎమోషనల్ గా తీసుకుంటున్నారు. ఇది ఎక్కడి దాకా వెళ్లిందంటే 25 రోజులకు జరిపే ఫ్యాన్ షో ఇప్పుడే హౌస్ ఫుల్ అయ్యేంత. మొదటి రోజు రికార్డు ఓపెనింగ్ ఖాయమే కానీ అది ఎంత మొత్తంలో ఉంటుందనేది రేపటికి క్లారిటీ రానుంది. కొంత కాలంగా తమిళంలో చెప్పుకోదగ్గ స్టార్ సినిమా లేకపోవడం పెద్ద ప్లస్ కానుంది.






# అసాధ్యం అనుకున్నది ప్రభాస్ చేయగలరా

టాలీవుడ్ స్టార్ హీరో ఎవరైనా సరే ఏడాదికి ఒక సినిమా విడుదల చేయడమనేది కలగా మిగిలిపోయింది. పవన్ కళ్యాణ్ చేసి చూపించారు కానీ దానికి కారణాలు వేరు. హరిహర వీరమల్లు, ఓజి షూటింగుల్లో జరిగిన విపరీతమైన జాప్యం వల్ల వాటికి ఉస్తాద్ భగత్ సింగ్ కు తక్కువ గ్యాప్ వచ్చింది కానీ, ముందుగా అనుకుని చేసినవి కాదు. ఇక అల్లు అర్జున్, రామ్ చరణ్, జూనియర్ ఎన్టీఆర్ వరస తెలిసిందే. రెండేళ్లు మినిమమ్ టైంగా మారిపోయింది. దానికి తోడు రిలీజుల వాయిదాలు. అయితే ప్రభాస్ వీళ్లకు భిన్నమైన వేగంతో వెళ్లడం ప్రత్యేకంగా గమనించాలి. డిసెంబర్ 3 ఫౌజీ రాకలో ఎలాంటి అనుమానం లేదు. కన్ఫర్మ్ అయిపోయింది. టైం తక్కువగా ఉన్నప్పటికీ దర్శకుడు హను రాఘవపూడి రెండు యూనిట్లతో పని చేయిస్తున్నారు. మైత్రి టీమ్ కూడా పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో ఎక్కడా బ్రేక్ రాకుండా చూసుకుంటోంది. బాలీవుడ్, ఓవర్సీస్ మార్కెట్ పరంగా అన్నింటికి అదే అనువైన తేదీ కావడంతో ఎట్టి పరిస్థితుల్లో దాన్ని వదులుకునే ఉద్దేశంలో లేరు. ఇది జరిగిన మూడు నెలలకు మార్చిలో స్పిరిట్ వచ్చేయాలి. ఇప్పటికే నలభై శాతం పూర్తి చేసిన దర్శకుడు సందీప్ రెడ్డి వంగా ఎక్కువ లొకేషన్స్, విఎఫ్ఎక్స్ హడావిడి లేకుండా యానిమల్ తరహాలో చాలా ఆర్గానిక్ గా తీస్తున్నారట. అందుకే వేగంగా అవుతోందని టాక్. ఇది కూడా డెడ్ లైన్ వదిలే ప్రసక్తే లేదనే తరహాలో పరుగులు పెడుతోంది. డిస్ట్రిబ్యూషన్ వర్గాలు అందరితో చర్చించాకే ప్యాన్ ఇండియా కోణంలో బెస్ట్ డేట్ అవుతుందని భావించి మార్చ్ 5 లాక్ చేసుకున్నారు. అంటే కేవలం మూడు నెలల గ్యాప్ లో రెండు సినిమాలు ప్రభాస్ నుంచి వచ్చినట్టు అవుతుంది. అంతేకాదు రాజా సాబ్ నుంచి చూసుకుంటే పదమూడు నెలల కాలంలో మూడు ప్యాన్ ఇండియా మూవీస్ ఇవ్వడం, ప్రభాస్ లాంటి స్టార్ హీరోకు సాధ్యం కావడం మిగిలిన వాళ్లకు స్ఫూర్తిగా నిలవాలి. తర్వాత కల్కి 2, సలార్ 2 లైన్ లో పెట్టిన ప్రభాస్ ఇవి కాకుండా ఇంకెవరికి కొత్త కమిట్ మెంట్స్ ఇవ్వలేదు. పలువురు దర్శకులు ప్రయత్నాల్లో ఉన్నారు కానీ ఇంకా ఫైనల్ కాలేదు.

# 'రా ఎన్టీఆర్'కు గుడ్‌బై..



జూనియర్ ఎన్టీఆర్ అభిమానుల పేరిట భారీ సేవా కార్యక్రమాలు చేపడతామని ప్రకటించి సోషల్ మీడియాలో హల్చల్ చేసిన 'రా ఎన్టీఆర్' సంస్థ ఇప్పుడు అనూహ్య నిర్ణయం తీసుకుంది. కొద్ది రోజుల క్రితం వరకు వార్తల్లో నిలిచిన ఈ సంస్థ, తాజాగా తమ కార్యకలాపాలను పూర్తిగా నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. అధికారిక ఎక్స్ ఖాతా ద్వారా విడుదల చేసిన ప్రకటనలో 'విజయం సాధించిన వారందరికీ మా అభినందనలు' అంటూ వ్యంగ్యం గా గుడ్‌బై చెప్పడం ఇప్పుడు నెట్టింట హాట్ టాపిక్‌గా మారింది. అసలు ఈ వివాదానికి ఆరంభం 'ఊరు–వాడ' పేరుతో ప్రకటించిన సేవా కార్యక్రమాలే. ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా 100 కోట్లతో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని సంస్థ ప్రకటించడంతో ఒక్కసారిగా అందరి దృష్టి దానిపై పడింది. ఈ ప్రకటన తర్వాత తమిళ హీరో విజయ్ తన అభిమాన సంఘాల ద్వారా చేపట్టిన సేవా కార్యక్రమాల తరహాలోనే ఇది కూడా ఉందని, జూనియర్ ఎన్టీఆర్ రాజకీయ రంగ ప్రవేశానికి ఇదే తొలి అడుగు కావచ్చని సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది. అయితే ఆ ప్రచారానికి అంతే త్వరగా బ్రేక్ కూడా పడింది. ఈ మధ్యనే జూనియర్ ఎన్టీఆర్ కార్యాలయం అధికారికంగా స్పందిస్తూ 'రా ఎన్టీఆర్' సంస్థతో మాకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేసింది. ఎన్టీఆర్ పేరు, ఇమేజ్‌ను ఉపయోగించి కొందరు వ్యక్తిగత ప్రయోజనం పొందేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిపింది. దీంతో నందమూరి అభిమానుల్లో చాలామంది కూడా ఈ సంస్థపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. వివాదం పెరుగుతున్న నేపథ్యంలో సంస్థ ప్రతినిధి సాయి రూప్ తిరుపతిలో మీడియా సమావేశం నిర్వహించి తమ ఉద్దేశం పూర్తిగా సామాజిక సేవేనని వివరణ ఇచ్చే ప్రయత్నం చేశారు. అయితే 100 కోట్ల నిధులు ఎలా సమీకరిస్తారనే ప్రశ్నలకు స్పష్టమైన సమాధానాలు ఇవ్వలేకపోవడంతో అనుమానాలు మరింత పెరిగాయి. దీంతో సోషల్ మీడియాలో విమర్శలు మరింత తీవ్రం అయ్యాయి.

# తీరంలో శివాని అందాల సందడి

నటి శివాని నగారం మరోసారి తన తాజా ఫొటోషూట్‌తో అభిమానుల దృష్టిని ఆకర్షించింది. సముద్రతీరంలో గాఢ ఎరుపు రంగు చీరలో కనిపించిన ఆమె అందం సామాజిక మాధ్యమాల్లో చర్చనీయాంశంగా మారింది. గాలికి ఎగిరే చీరకొంగు, మబ్బులతో నిండిన ఆకాశం నేపథ్యంగా ఆమె ఇచ్చిన హావభావాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

ఇటీవల సుహాస్ కథానాయకుడిగా వచ్చిన 'హే బల్వంత్' చిత్రంలో శివాని నగారం కనిపించింది. ఆ చిత్రం ఆశించిన స్థాయిలో విజయాన్ని అందుకోకపోయినా, తన పాత్ర పరిధిలో ఆమె నటనకు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభించింది. అయితే పాత్రకు పెద్దగా ప్రాధాన్యం లేకపోవడంతో ఆమె ప్రతిభ పూర్తిస్థాయిలో వెలుగులోకి రాలేదనే అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి.

ప్రస్తుతం సినిమాలకు కొంత విరామం లభించిన నేపథ్యంలో శివాని వరుస ఫొటోషూట్లతో అభిమానులను అలరిస్తోంది. ముఖ్యంగా ఈ బీచ్ ఫొటోలు ఆమెకు మరింత గుర్తింపు తీసుకొచ్చాయి. తెరపై సాధారణ యువతిగా కనిపించిన శివాని, ఈ చిత్రాల్లో మాత్రం హుందాతనం, సహజమైన అందంతో ఆకట్టుకోవడం విశేషం. ఈ ఫొటోలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వేగంగా వైరల్ అవుతుండగా, అభిమానులు ఆమె అందంపై ప్రశంసలు కురిపిస్తున్నారు. తదుపరి చిత్రాల ప్రకటన కోసం కూడా ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.మె నటనకు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభించింది. అయితే పాత్రకు పెద్దగా ప్రాధాన్యం లేకపోవడంతో ఆమె ప్రతిభ పూర్తిస్థాయిలో వెలుగులోకి రాలేదనే అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి.

ప్రస్తుతం సినిమాలకు కొంత విరామం లభించిన నేపథ్యంలో శివాని వరుస ఫొటోషూట్లతో అభిమానులను అలరిస్తోంది. ముఖ్యంగా ఈ బీచ్ ఫొటోలు ఆమెకు మరింత గుర్తింపు తీసుకొచ్చాయి. తెరపై సాధారణ యువతిగా కనిపించిన శివాని, ఈ చిత్రాల్లో మాత్రం హుందాతనం, సహజమైన అందంతో ఆకట్టుకోవడం విశేషం.
ఈ ఫొటోలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వేగంగా వైరల్ అవుతుండగా, అభిమానులు ఆమె అందంపై ప్రశంసలు కురిపిస్తున్నారు. తదుపరి చిత్రాల ప్రకటన కోసం కూడా ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

Printed, Published and Owned by **RAVU RAJITHA,** Printed at **KAKATHIYA PRINTERS,** LN Colony, Uppal IDA, Uppal. **Editor: RAVU NAGI REDDY. RAJAMUDRA PUBLICATIONS,** Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98, **RNI NO : TELTEL/2024/86684,** Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com